అహ్మదాబాద్ వెళ్లకుండానే
తిరిగొచ్చిన విమానం

పెరంబూర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): నగరం నుంచి అహ్మదాబాద్‌కు బయల్దేరిన విమానం మళ్లీ నగరంలోనే ల్యాండింగ్ అయింది. అహ్మదాబాద్ నుంచి లండన్‌కు గురువారం మధ్యాహ్నం బయల్దేరిన ఎయిర్ ఇండియా విమానం ప్రమాదానికి గురవడం అందరినీ నివ్వెరపోయేలా చేసింది. ఈ నేపథ్యంలో, నగరం నుంచి 182 మంది ప్రయాణికులతో అహ్మదాబాద్ బయల్దేరిన విమానం అక్కడ ల్యాండింగ్‌కు పరిస్థితులు అనుకూలించకపోవడంతో, మళ్లీ నగరానికి చేరుకుంది. పరిస్థితి అదుపులోకి వచ్చిన తర్వాత ఆ విమానం బయల్దేరి వెళ్లింది.

విమాన ప్రమాదం పట్ల నేతల దిగ్భ్రాంతి

అహ్మదాబాద్ విమాన ప్రమాదం తీవ్ర దిగ్భ్రాంతి కలుగజేసిందని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తెలిపారు. ఈ మేరకు సీఎం తన ఎక్స్ పేజీలో... విమానంలో ఉన్న ప్రయాణికుల కుటుంబాల గురించి నా ఆలోచన ఉందని, రక్షణ, సహాయక చర్యలు పూర్తిస్థాయిలో జరుగుతున్నాయని ఆశిస్తున్నట్లు సీఎం ట్వీట్ చేశారు. కాగా, ఈ ఘటనపై మాజీ ముఖ్యమంత్రులు, ఎడప్పాడి పళనిస్వామి, ఒ.ప న్నీర్‌సెల్వం తదితరులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ప్రకటన విడుదల చేశారు.

డీఎంకే ప్రభుత్వంలో
పెరిగిన మురుగన్ ప్రతిష్ట

● మంత్రి శేఖర్ బాబు

అడయార్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): డీఎంకే ప్రభుత్వ హయాంలోనే మురుగన్ (కుమారస్వామి) ప్రతిష్ఠ పెరిగిందని, దీనిని చూసి ప్రత్యర్థులు బెదిరిపోతున్నారని దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్ బాబు వ్యాఖ్యానించారు. కీల్పాక్కంలోని ఏకాంబరనాథర్ మెట్రిక్ హైయ్యర్ సెకండరీ పాఠశాలలో రూ.11.15 కోట్లతో తరగతి గదుల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, గత యేడాది దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో పళనిలో ముత్తమిళ్ మురుగన్ మహానాడు నిర్వహించామన్నారు. ఆ తర్వాత బీజేపీ నేతలు మదురైలో మురుగన్ మహానాడు నిర్వహించారన్నారు. మనం ఎవరిని ఇష్టపడుతున్నామన్నది ముఖ్యం కాదని, మనల్ని ఎవరు ఇష్టపడుతున్నారన్నదే ముఖ్యమన్నారు. ఆ ప్రకారంగా ప్రతి ఒక్క తమిళుడి ఆరాధ్యదైవంగా మురుగన్ ఉన్నారని, అలాగే, ద్రావిడ మోడల్ పాలన నేతగా స్టాలిన్ ఉన్నారన్నారు. తమ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత 3,109 ఆలయాలకు చేపట్టిన జీర్ణోద్ధరణ, కుంభాభిషేకాల్లో 117 మురుగన్ ఆలయాలున్నాయన్నారు. అలాగే వృద్ధులకు రూ.2.14 కోట్లతో ఆరుపడై దివ్యక్షేత్రాల ఆధ్యాత్మిక పర్యటనకు తీసుకెళుతున్నామన్నారు. తిరుత్తణి పుణ్యక్షేత్రానికి మరో రహదారి నిర్మాణం శరవేగంగా జరుగుతోందన్నారు. మరుదమలైలో 184 అడుగుల ఎత్తులో, తిమిరిలో 114 అడుగుల ఎత్తులో మురుగన్ విగ్రహాల ప్రతిష్ఠాపన పనులు జరుగుతున్నాయన్నారు. ఇలాంటి మంచి పనులు మురుగన్‌కు ఏ ప్రభుత్వంలో అయినా జరిగాయా? అని ఆయన ప్రశ్నించారు. ముఖ్యమంత్రి స్టాలిన్ సారథ్యంలోని డీఎంకే ప్రభుత్వానికే ఈ అరుదైన గౌరవం దక్కిందని మంత్రి శేఖర్ బాబు పేర్కొన్నారు.


తరగతి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న మంత్రి శేఖర్ బాబు తదితరులు



అమిత్‌షాకు మదురై ఎయిమ్స్ కనిపించలేదా?

మీ పథకాలకు నిధులిచ్చేది కూడా మేమే!

సేలం సభలో సీఎం స్టాలిన్ ధ్వజం

ఢిల్లీ పెత్తనాన్ని

దివ్యాంగులకు మూడుచక్రాల స్కూటర్లు అందజేస్తున్న సీఎం

ఎప్పటికీ అనుమతించం

చెన్నై, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ నుండి రాష్ట్రంపై పెత్తనం చెలాయించేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. సేలంలోని మోహన్‌కుమారమంగళం ప్రభుత్వ వైద్యకళాశాల మైదానంలో గురువారం ఉదయం ఏర్పాటైన సభలో రూ.880 కోట్లతో నిర్మించనున్న జౌళి పార్కుకు, రూ.100 కోట్లతో నిర్మించనున్న కొత్త గ్రంథాలయ భవనానికి ఆయన శంకుస్థాపన చేశారు. రూ.225 కోట్లతో పూర్తయిన పథకాలకు ప్రారంభోత్సవం చేసిన ఆయన 1,01,203 మంది లబ్ధిదారులకు సహాయాలు పంపిణీ చేశారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇటీవల మదురైలో పర్యటించిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా కేంద్ర ప్రభుత్వం అమలు చేసే పథకాలకు విడుదలయ్యే నిధులను మళ్లించి రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు ఖర్చు చేస్తున్నట్లు అసత్య ఆరోపణలు చేశారని, వాస్తవానికి కేంద్రం అమలు చేస్తున్న తాగునీటి పథకం, ప్రధాని ఆవాస్ యోజన పథకం తదితర పథకాలకు నిధులు చాలకపోతే తమ ప్రభుత్వమే 50 శాతం నిధులు సమకూర్చి ఆ పథకాలను పూర్తి చేస్తోందని, ఈ చేదు నిజం అమిత్‌షాకు తెలియకపోవటం గర్హనీయమన్నారు. మదురైలో రోజంతా పర్యటించిన అమిత్‌షాకు అక్కడ ఎయిమ్స్ ఆస్పత్రి నిర్మాణ పనులు ఎలా నత్తనడకన జరుగుతున్నాయో తెలియకపోవటం శోచనీయమన్నారు. పదేళ్లుగా ఎయిమ్స్ ఆస్పత్రి పనులు జరుగుతున్నాయంటే అక్కడ ఆస్పత్రి నిర్మిస్తున్నారా? లేక అంతరిక్ష పరిశోధన కేంద్రం నిర్మిస్తున్నారో తనకు అర్థం కావటం లేదని స్టాలిన్ ఎద్దేవా చేశారు. డీఎంకే గత నాలుగేళ్లలో మదురై నగరంలో అమలు చేసిన పథకాలను తెలుసుకుంటే కేంద్రంలోని పాలకులు ఆశ్చర్యపోతారన్నారు. కలైంజర్ శతజయంతి స్మారక గ్రంథాలయం, జల్లికట్టు స్టేడియం, కీళడి ఎగ్జిబిషన్ అంటూ పలు పథకాలను అమలు చేసినట్లు చెప్పారు. అమిత్‌షాలాగే కేంద్ర మంత్రి షెకావత్‌కూడా తమిళుల ప్రాచీన నాగరికత లోకానికి తెలియకుండా ఉండేందుకు కీళడి తవ్వకాల నివేదికలపై పసలేని విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. తమిళుల ప్రాచీన నాగరికతను, సంస్కృతిని నాశనం చేసేందుకే కేంద్రం కంకణం కట్టుకుందని స్టాలిన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కీళడి తవ్వకాల్లో లభించిన వస్తువులన్నీ తమిళుల నాగరికత ఐదు వేల సంవత్సరాల నాటిదని రుజువు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తుందని, దానిపై ప్రధాన ప్రతిపక్ష నాయకుడు ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) పల్లెత్తుమాట మాట్లాడకుండా మౌనం పాటించి కేంద్రానికి గులాంగిరీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడుతుందని అమిత్‌షా చెబుతుంటే ఈపీఎస్ నవ్వి ఊరుకుంటున్నారని తెలిపారు.

సేలం జిల్లాకు వరాల జల్లు...

ఈ సభలో సేలం జిల్లాకు స్టాలిన్ ఆరు వరాలను ప్రకటించారు. ఆ మేరకు సేలంలో రూ.100 కోట్లతో రహదారులను అభివృద్ధి పరుస్తామని, సేలం సెవ్వాపేట సంతను రూ.9కోట్లతో అభివృద్ధి పరచనున్నామని, శంకగిరి మున్సిపాలిటీలో కొత్త వాణిజ్య సముదాయం నిర్మిస్తామని, మేట్టూరు నరసింగాపురంలో కొత్త పురపాలక సంఘాల భవనాలు నిర్మిస్తామని, ఆత్తూరులోరూ.5 కోట్లతో సమగ్రనీటి పథకాలు అమలు చేస్తామని చెప్పారు. ఇదేవిధంగా తారామంగళం, ఎడప్పాడి, ఆత్తూరు ప్రాంతాల్లో కొత్త నీటి పథకాలు అమలు చేస్తామని, తలైవాసల్ ఇళుప్పనత్తం వ్యవసాయ విక్రయ కేంద్రాన్ని రూ.10 కోట్లతో అభివృద్ధిపరుస్తామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఈవీ వేలు, ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం, రాజేంద్రన్, ఎంపీలు సెల్వగణపతి, మలైయరసన్, మాతేశ్వరన్, మణి, శాసనసభ్యులు అరుల్, సదాశివం, సేలం కార్పొరేషన్ మేయర్ రామచంద్రన్, సేలం జిల్లా కలెక్టర్ డాక్టర్ బృందా దేవి తదితరులు పాల్గొన్నారు.

క్వింటాల్ ధాన్యానికి రూ.2500లు...

గత నాలుగేళ్లుగా మేట్టూరు డ్యాం నుంచి జూన్ 12న తన చేతుల మీదుగా సాగునీరు విడుదల చేయడం రైతులకు ఎంత సంతోషం కలుగుతుందో అంతకంటే ఎక్కువ ఆనందం తనకు కలుగుతోందని స్టాలిన్ చెప్పారు. ఈ సంతోష సమయంలో క్వింటాల్ ధాన్యానికి రూ.2500లు కొనుగోలు ధర చెల్లిస్తామని సభికుల హర్షధ్వానాల నడుమ ప్రకటించారు. సాధారణ రకం ధాన్యానికి రూ.131లు, సన్నరకం ధాన్యానికి రూ.156లు పెంచి చెల్లిస్తామన్నారు. ఆ మేరకు సాధారణ రకం వరిధాన్యానికి 2500లు, సన్నరకం వరిధాన్యానికి రూ.2545లు చొప్పున కొనుగోలు ధరలు చెల్లించనున్నట్లు ఆయన తెలిపారు. దీనివలన సుమారు 10లక్షల మంది అన్నదాతలు లబ్ధిపొందుతారని చెప్పారు.

కులదైవం అంటూనే గునపాలతో గుచ్చుతారా?

● అయ్యగారంటూ అథఃపాతాళానికి తొక్కేస్తారా? ● అడుగడుగునా అవమానాలే
● నన్ను ఒంటరి చేసేందుకు కుట్ర ● త్వరలో తాడోపేడో తేల్చుకుంటా ● అన్బుమణిపై రాందాస్ తీవ్ర ఆగ్రహం


రాందాస్

చెన్నై, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): 'మా అందరి కులదైవం మీరే అని పొగడుతూనే నా గుండెల్లో గునపాలు దించుతున్నారు. అన్నింటికీ మా అయ్యగారే నని చెబుతూ నన్ను అథఃపాతాళంలోకి తొక్కేస్తున్నారు. అడుగడుగునా అవమానిస్తున్నారు. ఒంటరిని చేసి, మూలన కూర్చోబెట్టాలని కుట్ర పన్నుతున్నారు' అంటూ పీఎంకే వ్యవస్థాపకుడు రాందాస్ తన కుమారుడైన పీఎంకే అధ్యక్షుడు అన్బుమణిపై నిప్పులు చెరిగారు. గురువారం ఉదయం దిండివనం తైలాపురం గార్డెన్‌లో మీడియాతో మాట్లాడుతూ... తనకు పార్టీ కార్యాచరణ అధ్యక్షుడి (అన్బుమణి)కి మధ్య సాగిన చర్చలు 'డ్రా'గా ముగిశాయని, పార్టీలోని 34 విభాగాలకు చెందిన 14 మంది పెద్దలు ఇద్దరి మధ్య రాజీ కుదిర్చేందుకు చేసిన ప్రయత్నాలు నిష్ఫలమయ్యాయన్నారు. వారి సూచన మేరకు పార్టీ అధ్యక్ష పదవి విడిచిపెట్టేందుకు సిద్ధమైన అన్బుమణి చర్చలకు రాకుండా మొండికేశారన్నారు. ఆ తర్వాతే తాను తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమయ్యానన్నారు. అన్బుమణి పార్టీని పూర్తిగా కమ్మేయాలని ప్రయత్నిస్తున్నాడని, తన మనవడు ముకుందన్‌కు పార్టీ పదవి ఎందుకివ్వకూడదని ప్రశ్నిస్తే 'మీకేం తెలియదు. గేటు మూసుకుని మునిమనవళ్ళతో ఆడుకోండి' అంటూ యెద్దేవా చేశాడని ఆరోపించారు. తాను రోజూ వేలాది మంది పార్టీ శ్రేణులను కలుసుకుంటూనే ఉన్నానని, వన్నియార్లంతా తనను కులదైవంగా భావిస్తున్నారని, వారికి తానే మార్గదర్శకుడిగా వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. 46 యేళ్లపాటు కంటికి రెప్పలా కాపాడుతూ వచ్చిన పీఎంకేకు అధ్యక్షుడిగా ఉండే హక్కు తనకు లేదా అని ప్రశ్నిస్తూ.. ఇలా అడగడమే తనకు అవమానంగా వుందని రాందాస్ తీవ్ర ఆవేదన చెందారు. తాను దశాబ్దాలపాటు శ్రమించి నిర్మించిన పీఎంకే కోటలో అద్దెకు దిగిన అన్బుమణి తనను మెడపట్టి గెంటేసేందుకు ప్రయత్నిస్తున్నాడని ఆరోపించారు. జిల్లా కార్యదర్శులు తనను కలుసుకోకుండా అన్బుమణి ప్రయత్నిస్తున్నాడని, వేకువజామున వారికి ఫోన్ చేసి పార్టీ వ్యవస్థాపకుడి వద్దకు వెళ్లకూడదని బెదిరించాడని తెలిపారు. మరో మూడేళ్లు అన్బుమణి ఓపికపడితే తానే అతడికి పట్టాభిషేకం చేసేవాడినని, పార్టీని పూర్తిగా అప్పగించేవాడినన్నారు. ఏడేళ్ల క్రితం ప్రధాని మోదీ పదవీస్వీకార వేడుకల్లో పాల్గొనేందుకు ఢిల్లీ వెళ్లినప్పుడు అన్బుమణి పార్టీ వ్యవహారాలను తనకు అప్పగించాలని అడిగాడని, ఆ తర్వాత చెన్నై తిరిగి వస్తుండగా తన మాటలు కష్టపెట్టి ఉంటే క్షమించమని అడిగాడని, అప్పుడే తాను కంటతడిపెట్టుకున్నానని రాందాస్ గుర్తు చేసుకున్నారు. అన్బుమణి మాటలు క్రుంగదీయటంతో మహాబలిపురంలో బసచేశానని, ఆ సమయంలో తన కోడలు సౌమ్య అక్కడికి వచ్చి తన భర్తకు పార్టీ అధ్యక్షపదవి కట్టబెట్టాల్సిందేనంటూ ఆజ్ఞాపించిందని ఆరోపించారు. ఒకటిన్నర నెల తర్వాత తర్జనభర్జనలు జరిగాక అన్బుమణికి పార్టీ అధ్యక్షపదవి కట్టబెట్టానని చెప్పారు. ఆ సమయంలో పార్టీ వ్యవహారాల్లో కుటుంబంలోని మహిళలెవరూ జోక్యం చేసుకోకూడదని ఆంక్షలు విధించానని, వాటిని తోసిపుచ్చి ధర్మపురిలో సౌమ్యని అభ్యర్థిగా ప్రకటించి తన మాటకు గౌరవం లేకుండా చేశారని ఆరోపించారు. వచ్చే యేడాది శాసనసభ ఎన్నికల తర్వాత పార్టీ వ్యవహారాలన్నీ అన్బుమణే చూసుకుంటాడని, అప్పటి వరకు పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడిగా తానే కొనసాగుతానని స్పష్టం చేశారు.


కోవైలో కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న అన్నామలై

రాష్ట్రంలో రానున్నది సంకీర్ణం కాదు..
బీజేపీ పాలనే

● ఈపీఎస్‌కు అన్నామలై షాక్

చెన్నై, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే అధినేత ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్)తో ఆది నుంచి ఎడమొహం పెడమొహంగా ఉండే బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు అన్నామలై.. తాజాగా ఆయనకు షాకిచ్చారు. ఎన్నికల అనంతరం సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడే ప్రసక్తే లేదని ఈపీఎస్ చెబుతుండగా.. 'అవునవును.. సంకీర్ణ ప్రభుత్వం కాదు, వచ్చేది బీజేపీ ప్రభుత్వమే' అంటూ అన్నామలై వ్యాఖ్యానించారు. ఈ వ్యవహారం రెండు పార్టీల మధ్య చిచ్చు రేపేలా కనిపిస్తోంది. కోయంబత్తూరులో డిమాండ్ల పరిష్కారం కోసం నాలుగు రోజులుగా ఆందోళన చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను గురువారం ఉదయం కలుసుకున్న అన్నామలై.. వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి 11 యేళ్లు పూర్తయిందని, ప్రధాని మోదీ సుస్థిర పాలన అందిస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి వచ్చే ఆదాయాన్ని కేంద్రం ప్రభుత్వం వందశాతం మళ్లీ తిరిగిచ్చేలా వివిధ పథకాలను కూడా అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో డీఎంకే అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు దాటినా ఎన్నికల మేనిఫెస్టోలోని 50హామీలను కూడా పూర్తిగా అమలు చేయలేదని ఆయన విమర్శించారు.కోయంబత్తూరు విమానాశ్రయం విస్తరణకు కేంద్రం సిద్ధంగా ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం స్థలసేకరణ ఇంకా పూర్తి చేయలేదని ఆరోపించారు. ఈ సారి శాసనసభ ఎన్నికల్లో ఎక్కువ స్థానాల్లో బీజేపీ పోటీ చేసే అవకాశం ఉందని, ఈ విషయమై తాను ప్రధాని మోదీకి ఎలాంటి లేఖలు రాయలేదని విలేఖరులడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు. రాష్ట్రంలో 2026లో సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని చెప్పలేనని, రానున్నది బీజేపీ పాలన మాత్రమేనని చెప్పగలనని అన్నామలై పేర్కొన్నారు. పార్టీ అధిష్టానవర్గం తీసుకునే ఎలాంటి నిర్ణయాలకైనా తాను కట్టుబడి పనిచేస్తానని అన్నామలై చెప్పారు.

పెద్దల సభకు ఆరుగురూ ఏకగ్రీవం

● ధ్రువీకరణపత్రాలు అందించిన రిటర్నింగ్ అధికారి


రాజ్యసభకు ఎంపికైన ఎంపీలతో ఉపముఖ్యమంత్రి ఉదయనిధి

ప్యారీస్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఆరు రాజ్యసభ స్థానాలకు అధికార డీఎంకే, ప్రతిపక్ష అన్నాడీఎంకే తరఫున నామినేషన్ వేసిన ఆరుగురు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారికంగా గురువారం ప్రకటించారు. వీరు రాబోయే పార్లమెంటు సమావేశాల్లో ఎంపీలుగా ప్రమాణస్వీకారం చేస్తారు. ప్రస్తుతం రాష్ట్రం తరుపున పెద్దలసభలో 18 మంది సభ్యులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరిలో ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి, వైగో, పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి, డీఎంకే న్యాయవిభాగానికి చెందిన పి.విల్సన్, షణ్ముగం, అబ్దుల్లా, అన్నాడీఎంకేకు చెందిన చంద్రశేఖరన్ పదవీకాలం జూలై 24వ తేదీతో ముగియనుంది. ఈ ఆరుస్థానాలకు ముందుగానే ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల కమిషన్ ప్రకటించింది. డీఎంకే తరఫున సీనియర్ న్యాయవాది పి.విల్సన్‌కు మళ్లీ అవకాశం రావడంతో ఆయనతో పాటు శివలింగం, సల్మా డీఎంకే కూటమి తరుపున ఎంఎన్ఎం అధ్యక్షుడు, నటుడు కమల్‌హాసన్, అన్నాడీఎంకే తరుపున ఇన్బదురై, ధనపాల్ తమ నామినేషన్ వేశారు. వీరితో పాటు ఇండిపెండెంట్లుగా పద్మరాజన్, అగ్ని ఆళ్వార్‌తో పాటు ఏడుగురు నామినేషన్ వేశారు. వీటిని పరిశీలించిన ఎన్నికల అధికారులు డీఎంకే, అన్నాడీఎంకే అభ్యర్థుల నామినేషన్‌పత్రాలను అంగీకరించారు. ఇండిపెండెంట్లకు మద్దతుగా ఒక్క ఎమ్మెల్యే కూడా సంతకం చేయకపోవడంతో వాటిని తోసిపుచ్చారు. గురువారం సాయంత్రం 3 గంటలతో నామినేషన్ ఉపసంహరణ గడువు ముగియడంతో డీఎంకే, అన్నాడీఎంకే, ఎంఎన్ఎం తరుపున పోటీ చేసిన అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎంపీకైనట్లు ఎన్నికల అధికారి, రాష్ట్ర అసెంబ్లీ కార్యదర్శి సుబ్రమణ్యం ప్రకటించారు. వీరికి ధ్రువ పత్రాలు అందజేశారు. ఆ పదవిలో వీరు ఆరేళ్లపాటు కొనసాగుతారు. ఈ నేపథ్యంలో, రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎంపికైన సభ్యులకు డీఎంకే, అన్నాడీఎంకే పార్టీలతో పాటు మిత్రపక్షాల నేతలు శుభాకాంక్షలు తెలిపారు.


అన్నాడీఎంకే రాజ్యసభ సభ్యులు

మెరీనాలో దివ్యాంగులు, వృద్ధులకోసం
బ్యాటరీ వాహనాలు

పెరంబూర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెరీనా బీచ్‌లో దివ్యాంగులు, వృద్ధుల కోసం బ్యాటరీ వాహన సేవలు గురువారం నుంచి అందుబాటులోకి వచ్చాయి. బీచ్ నిర్వహణ, ఇతర కార్యకలాపాలను పరిశీలించి బ్లూ ఫాగ్ సర్టిఫికెట్ అందజేస్తున్నారు. రాష్ట్రంలో కోవలం బీచ్ ఇప్పటికే బ్లూ ఫాగ్ సర్టిఫికెట్ పొందగా, మెరీనా, తిరువాన్మియూర్ సహా ఆరు బీచ్‌లకు బ్లూ ఫ్లాగ్ సర్టిఫికెట్ పొందేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా జీసీసీ ఆధ్వర్యంలో మెరీనా బీచ్‌లో కొత్త ఫుట్‌పాత్‌లు, సైకిల్ మార్గాలు, ఆట స్థలం, వాచ్ టవర్, నిఘా కెమెరా, ఓపెన్ ఎయిర్ జిమ్ తదితరాలు ఏర్పాటుచేస్తున్నారు. ఈ నేపథ్యంలో, వృద్ధులు, దివ్యాంగులు బీచ్ ప్రవేశం నుంచి సముద్ర తీరం, ఇతర ప్రాంతాలకు వెళ్లేలా బ్యాటరీ వాహన సేవలు వినియోగించుకోవచ్చు. మెరీనా సర్వీస్ రోడ్డులోని నాలుగు ప్రాంతాల్లో ఈ వాహనాలు ఉంచాలని నిర్ణయించగా, తొలివిడతగా రెండు ప్రాంతాల్లో ఏర్పాటుచేసినట్లు జీసీసీ అధికారులు తెలిపారు. ఈ వాహనాలను గురువారం రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఉదయనిధి లాంఛనంగా ప్రారంభించారు. అదే విధంగా రోడ్ల పరిశుభ్రత కోసం ప్రత్యేకంగా దిగుమతి చేసుకున్న వాహనాలను సైతం ఉదయనిధి ప్రారంభించారు.


కొత్తగా రోడ్డెక్కిన వాహనాలు

సమాచార ధ్వని

వేదవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో 'పారిజాతాపహరణం'పై ప్రసంగం

టి.నగర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 29న 'తిమ్మన పారిజాతాపహరణం - మానసోల్లాస వ్యాఖ్యానం'పై ప్రసంగం ఉంటుంది. వేద విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో తరతరాల తెలుగు కవిత ఉపన్యాస ధారావాహిక 162వ ప్రసంగంగా 'తిమ్మన పారిజాతాపహరణం అంశంపై హైదరాబాద్‌కు చెందిన అన్నమాచార్య వాఙ్మయ పరిశోధకులు గంధం బసవ శంకరరావు ప్రసంగించనున్నారని సంస్థ అధ్యక్షులు జేకే రెడ్డి, కార్యదర్శి కందనూరు మధు ఓ ప్రకటనలో తెలిపారు. టి.నగర్ విజయరాఘవ రోడ్డులోని ఆంధ్రాక్లబ్ కృష్ణాహాలులో 29వ తేదీ ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు ఈ ప్రసంగ కార్యక్రమం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని తెలిపారు.

టీఎన్‌పీఎస్సీలో అదనపు పోస్టులు

పెరంబూర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు ప్రభుత్వ ఉద్యోగుల ఎంపిక కమిషన్ (టీఎన్‌పీఎస్సీ) పలు శాఖల్లో ఖాళీగా ఉన్న 651 పోస్టుల భర్తీకి గత నెల 21వ తేది నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ఉద్యోగాలకు ఈ నెల 25వ తేదిలోగా దరఖాస్తు చేసుకోవచ్చు. రాతపరీక్ష ఆగస్టు 4 నుంచి 10వ తేది వరకు జరుగనుంది. కాగా ఈ పోస్టులకు అదనంగా 418 పోస్టులు భర్తీచేయనున్నారు. https://www.tnpsc.gov.in/ అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

ఇంజనీరింగ్ అడ్మిషన్లు

● ర్యాండమ్ నెంబర్ల విడుదల

పెరంబూర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల ర్యాండమ్ నెంబర్లు విడుదలయ్యాయి. రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కోర్సుల్లో 2025-26వ విద్యా సంవత్సరంలో అడ్మిషన్లకు మే 5 నుంచి ఈనెల 6వ తేది వరకు దరఖాస్తులు స్వీకరించారు. ఈ నేపథ్యంలో, దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు 10 నెంబర్లతో కూడిన ర్యాండమ్ నెంబర్‌ను tncaonline.org అనే వెబ్‌సైట్‌లో విడుదల చేసినట్లు ఇంజనీరింగ్ విద్యార్థుల అడ్మిషన్ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది.

రేపు రేషన్ గ్రీవెన్స్

పెరంబూర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పౌరసరఫరాల శాఖ మండల కార్యాలయాల్లో శనివారం రేషన్ గ్రీవెన్స్ జరుగనుంది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే ఈ గ్రీవెన్స్‌లో ఆయా ప్రాంతాల వినియోగదారులు పాల్గొని సమస్యలు తెలిపి పరిష్కారం పొందవచ్చే. అలాగే, రేషన్ దుకాణాల్లో అందిస్తున్న సరుకుల నాణ్యత, తూకం తక్కువగా ఉండడం ఇతరత్రా సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చని ఆహార భద్రతా శాఖ తెలియజేసింది.

నేడు మూడు నియోజకవర్గాల నేతలతో సీఎం స్టాలిన్ భేటీ

పెరంబూర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మూడు నియోజకవర్గాల పార్టీ నేతలతో శుక్రవారం డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సమావేశం కానున్నారు. మదురైలో ఈ నెల 1న జరిగిన డీఎంకే సర్వసభ్య సమావేశంలో పార్టీ అధ్యక్షుడు స్టాలిన్.. జూన్ మొదటి వారం నుంచి పార్టీ నాయకులతో నియోజకవర్గాల వారీగా అన్నా అరివాలయంలో సమావేశం నిర్వహిస్తానని ప్రకటించారు. ఆ ప్రకారం, 'ఉడన్ పిరప్పే వా' అనే పేరుతో శుక్రవారం చిదంబరం, విల్లుపురం, ఉసిలంబట్టి నియోజవర్గాల నేతలతో పార్టీ అధ్యక్షుడు సమావేశం కానున్నారని డీఎంకే ప్రధాన కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

తిరుచెందూర్ కుంభాభిషేకానికి 300 మంది నియామకం

పెరంబూర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): తిరుచెందూర్ సుబ్రమణ్యస్వామి ఆలయ మహా కుంభాభిషేకం జూలై 7వ తేది జరుగనుంది. కుంభాభిషేకం ఏర్పాట్లు, ప్రత్యేక పనులకు చెన్నై, పళని, తిరుప్పరంగుండ్రం, మదురై తదితర ఆలయాల నుంచి 300 మంది ఉద్యోగులను జూలై 1 నుంచి 8వ తేది వరకు నియమిస్తూ దేవాదాయ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. 12 ఏళ్ల అనంతరం జూలై 7న ఉదయం 6.15 నుంచి 6.50 గంటల్లోపు కుంభాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు ఇదివరకే ప్రకటించిన విషయం తెలిసిందే.

రేపు ఎంఎన్‌ఎం నాయకుల సమావేశం

ప్యారీస్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మక్కల్ నీది మయ్యం (ఎంఎన్‌ఎం) అధ్యక్షుడు, నటుడు కమల్‌హాసన్ అధ్యక్షతన శనివారం పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి అరుణాచలం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆళ్వార్‌పేటలోవున్న పార్టీ కార్యాలయంలో ఉదయం 10గంటలకు ఈ సమావేశం ప్రారంభమవుతుందని, దీనికి హాజరయ్యే వారు పూల బొకే, శాలువాలు కాకుండా పుస్తకాలు తేవాలని విజ్ఞప్తి చేశారు. కాగా, డీఎంకే కూటమి నుంచి రాజ్యసభ సభ్యుడిగా ఎంపికైన నేపథ్యంలో ఎంఎన్‌ఎం ప్రధాన నేతల కమిటీ, కార్యవర్గ కమిటీ, జిల్లా కార్యదర్శులు, కార్మిక సంఘ నిర్వాహకులతో కమల్ మొదటిసారి సమావేశం కానున్నారు.

కలెక్టరేట్‌లో ఉన్నత విద్య మార్గదర్శక కేంద్రం

పెరంబూర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక హార్బర్ సమీపంలోని చెన్నై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉన్నత విద్య మార్గదర్శక కేంద్రం ఏర్పాటైంది. ఈ విషయమై జిల్లా కలెక్టర్ రష్మి సిద్ధార్థ్ విడుదల చేసిన ప్రకటనలో... ప్లస్ వన్, ప్లస్ టూ తరగతుల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు పాలిటెక్నిక్, ఐటీఐ వంటి వృత్తి విద్యా కోర్సులు, ఉన్నత విద్యకు సంబంధించిన సమాచారం. ఆర్ట్స్, సైన్స్ కళాశాలలు, పాలిటెక్నిక్, ఐటీఐలో సీట్ల ఖాళీలు తదితరాలకు సంబంధించి ఈ కేంద్రాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు సంప్రదించవచ్చని తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలోని 6వ అంతస్తులో ఏర్పాటైన ఈ కేంద్రాన్ని అన్ని పనిరోజుల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5.45 గంటల వరకు 044-2526 8320 (ఎక్స్‌టెన్షన్), 604, 9894468325 నెంబర్లు సంప్రదించాలని కలెక్టర్ తెలిపారు.

ఫుట్ బోర్డు ప్రయాణం వద్దు

● విద్యార్థులకు ట్రాఫిక్ పోలీసుల సూచన

పెరంబూర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): బస్సుల్లో ఫుట్ బోర్డుపై ప్రయాణించరాదని విద్యార్థులకు ట్రాఫిక్ పోలీసులు సూచించారు. అన్నానగర్, అమింజికరై, అరుంబాక్కం, తిరుమంగళం తదితర ప్రాంతాల్లోని పాఠశాలల్లో చదివే విద్యార్థులు బస్సుల్లో ఫుట్ బోర్డులపై నిలబడి ప్రయాణించడం సాధారణంగా మారింది. దీనిపై దృష్టి సారించిన ట్రాఫిక్ పోలీసు విభాగం పోలీసులు, పాఠశాలల్లో సమావేశాలు నిర్వహించి, ఫుట్ బోర్డు ప్రయాణం ప్రమాదకరమని, అలాంటి చర్యలకు పాల్పడవద్దని అవగాహన కల్పిస్తున్నారు. నగరంలోని అన్ని పాఠశాలలు, కళాశాలల్లో ఇలాంటి అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు నగర ట్రాఫిక్ విభాగం పోలీసులు తెలిపారు.

పల్లవుల కాలంనాటి శిల్పాలు లభ్యం

ప్యారీస్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లా తిరువెన్నైనల్లూరు సమీపంలోని మేల్‌దనియాళంపట్టు గ్రామంలో పురావస్తు శాఖ జరిపిన తవ్వకాల్లో పల్లవరాజుల కాలంనాటి దేవతామూర్తుల శిల్పాలు లభ్యమయ్యాయి. ఈ గ్రామంలో విల్లుపురంకు చెందిన పురావస్తుశాఖ పరిశోధకులు సెంగుట్టువన్, తమిళలగన్ పర్యవేక్షణలో తవ్వకాలు కొనసాగుతున్నాయి. బుధవారం జరిపిన తవ్వకాల్లో పల్లవరాజుల కాలంనాటి కొర్రవై, మూర్తదేవి శిల్పాలు బయల్పడ్డాయి. వీటిని పరిశీలించిన పరిశోధకులు దక్షిణ ప్రాంతాన్ని పరిపాలించిన పల్లవరాజ వంశీయులు వందల సంఖ్యలో దేవాలయాలను నిర్మించి నిత్యపూజలు చేయించారని, ఆ రీతిలో విల్లుపురం జిల్లాలో నిర్మించిన ఆలయాల్లో మేల్‌దనియాళంపట్టు గ్రామం చెరువుగట్టున విష్ణు దుర్గాలయం ఒకటని తెలిపారు. ఈ ఆలయం గర్భగుడిలో ప్రస్తుతం లభ్యమైన అమ్మవార్ల విగ్రహాలు ప్రతిష్ఠించి పూజలు చేసేవారని, ఈ ఆలయానికి వెళ్ళేందుకు 8 సొరంగ మార్గాలు కూడా నిర్మించినట్లు చరిత్ర చెబుతోందని తెలిపారు. సుమారు 1,200 ఏళ్ళ (8వ శతాబ్దం) నాటి ఈ శిల్పాలను భద్రపరిచేందుకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అప్పగించినట్లు పరిశోధకులు తెలిపారు.



మేల్‌దనియాళంపట్టు గ్రామంలో లభ్యమైన పురాతన శిల్పాలు

రేషన్ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీ

తిరుత్తణి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు సమీపంలోని బొమ్మరాజుపేట గ్రామంలోని రేషన్ దుకాణాలను తిరుత్తణి ఎమ్మెల్యే ఎస్, చంద్రన్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో, రేషన్ దుకాణాల్లోని తూకం, సరుకుల నాణ్యత పరిశీలించారు. అనంతరం రేషన్ కోసం వచ్చిన మహిళలను దుకాణాల్లో ఏమైనా సమస్యలున్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పళ్లిపట్టు డీఎంకే సౌత్ యూనియన్ కార్యదర్శి జి.రవీంద్ర, వ్యవసాయ సహకార సంఘం కార్యదర్శి యేసుపాదం తదితరులు పాల్గొన్నారు.



రేషన్ తూకాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చంద్రన్

విద్యుత్‌శాఖలో 400పైగా పోస్టులు

● దరఖాస్తులు ఆహ్వానించిన టీఎన్‌పీఎస్సీ

ప్యారీస్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు విద్యుత్ బోర్డు (టీఎన్‌ఈబీ)లో ఖాళీ పోస్టుల భర్తీకి తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎన్‌పీఎస్సీ) దరఖాస్తులను ఆహ్వానిస్తూ గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రప్రభుత్వశాఖల్లో ఖాళీ అయ్యే పోస్టులలో టీఎన్‌పీఎస్సీ రాతపరీక్ష నిర్వహించి భర్తీ చేస్తుంటుంది. ఆ రీతిలో ప్రస్తుతం టీఎన్‌ఈబీలో ఖాళీగావున్న 416కు పైగా పోస్టుల వివరాలను వెల్లడించింది. అసిస్టెంట్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్) -391, అసిస్టెంట్ అకౌంటింగ్ ఆఫీసర్ - 25, శాఖపరమైన విభాగంలో డిగ్రీ పూర్తిచేసినవారు ఈ పోస్టులకు దరఖాస్తులు సమర్పించవచ్చు.

వయోపరిమితి...

ఎస్సీ,ఎస్టీ వర్గాలకు చెందినవారు 37ఏళ్ళు దాటకుండా, ఇతర వర్గాలవారు 32ఏళ్ళు దాటకుండా ఉండాలి. దరఖాస్తు చేసుకున్నవారు టీఎన్‌పీఎస్సీ నిర్వహించే రాతపరీక్షలకు హాజరుకావాలి. ఈ పరీక్షల్లో పొందేమార్కుల ఆధారంగా ఇంటర్వ్యూ లేకుండా అభ్యర్థుల ఎంపిక ఉంటుంది. ఈ నెల 25వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అభ్యర్థులు టీఎన్‌పీఎస్సీ వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకున్న దరఖాస్తును పూర్తిచేసి ఆన్‌లైన్ ద్వారా సమర్పించవచ్చు. మరిన్ని వివరాల కోసం https://www.tnpsc.gov.in/ వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చు.

ప్రైవేటు పాఠశాలలకు ఫీజుల నిర్ణయం

● 30వ తేదీలోగా దరఖాస్తుకు అవకాశం

ప్యారీస్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రైవేటు పాఠశాలలు 2025-2026వ విద్యాసంవత్సరానికి సంబంధించి వసూలు చేయాల్సిన ఫీజు నిర్ణయించినట్లు రాష్ట్రప్రభుత్వం తెలిపింది. ఇప్పటి వరకు ఫీజు నిర్ణయానికి సంబంధించి రాష్ట్రప్రభుత్వం నియమించిన కమిటీకి ఈ నెల 30వతేదీ లోగా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించినట్లు సమాచారం తెలిసింది. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖ అనుమతి పొందిన సుమారు 12వేలకు పైగా పాఠశాలున్నాయి. వీటిలో ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు కంటే అధికంగా వసూలు చేస్తున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. కొంతమంది పాఠశాల విద్యాశాఖకు ఫీజు ప్రభుత్వమే నిర్ణయించాలని విజ్ఞప్తిచేశారు. మరోవైపు మద్రాస్ హైకోర్టులో స్కూల్ ఫీజు వ్యవహారంపై పలువురు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ జరిగింది. పాఠశాల విద్యాశాఖ తరుపున హాజరైన న్యాయవాదులు ప్రైవేటు పాఠశాలలకు ఫీజులు నిర్ణయించే కమిటీని ప్రభుత్వం నియమించిందని, ఈ కమిటీకి రిటైర్డ్ న్యాయమూర్తి ఆర్.బాలసుబ్రమణ్యం చైర్మెన్‌గా ఉన్నారని తెలిపి, ఈ కమిటీ ఒక్కొక్క పాఠశాలకు మూడేళ్ళకొకసారి ఫీజులు నిర్ణయిస్తోందని న్యాయస్థానానికి వివరించారు. ఈ కమిటీకి దరఖాస్తు సమర్పించిన 647 ప్రైవేటు పాఠశాలలకు వసూలు చేయాల్సిన ఫీజులను నిర్ణయించామని, ఈ నెల 30వ తేదీవరకు ప్రైవేటు పాఠశాలలు ఫీజుల నిర్ణయం కోసం దరఖాస్తులు సమర్పించేందుకు అవకాశం కల్పించినట్లు న్యాయస్థానానికి వివరణ ఇచ్చారు.

మెడలో పాముతో టాస్మాక్ దుకాణానికి !

అడయార్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి జిల్లాలో ఓ తాగుబోతు చేసిన పనికి స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. జిల్లాలోని ఫోర్ రోడ్స్ సమీపంలో టాస్మాక్ మద్యం షాపు ఉండగా, ఓ యువకుడు మెడలో పాము వేసుకుని వచ్చాడు. ఆ సమయంలో అక్కడ ఉన్నవారంతా భయంతో పరుగులు తీశారు. టాస్మాక్ సిబ్బంది ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఆ యువకుడు అడిగిన మద్యాన్ని ఇచ్చి వెళ్ళిపోవాలని కోరారు. అయితే, ఆ యువకుడు మాత్రం అక్కడే మద్యాన్ని తాను తాగడంతో పాటు పాముకు తాగించుకుంటూ అక్కడ నుంచి వెళ్ళిపోయాడు. అయితే, మెడలో పాముతో నడిచివెళుతున్న ఆ తాగుబోతును చూసి పాదాచారులు, స్థానికులు భయపడిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు వెళ్లి ఆ యువకుడుని అదుపులోకి తీసుకున్నారు.



వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వండి : పొన్ముడి

● 21న సీబీఐ కోర్టు తీర్పు

అడయార్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): అక్రమ నగదు లావాదేవీలు, నిరోధక చట్టం కేసులో వ్యక్తిగత విచారణ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ మాజీ మంత్రి, డీఎంకే సీనియర్ నేత డాక్టర్ పొన్ముడి దాఖలు చేసిన పిటిషన్‌పై ఈ నెల 21వ తేదీ సీబీఐ ప్రత్యేక కోర్టు తీర్పు వెలువరించనుంది. 2006-11 వరకు డీఎంకే ప్రభుత్వ హయాంలో ఆయన ఉన్నత విద్యాశాఖామంత్రిగా ఉన్నారు. ఆ సమయంలో ప్రభుత్వం అనుమతించినదానికంటే అధికంగా గంధపు చెట్లను నరకడం వల్ల ప్రభుత్వానికి రూ.28.36 కోట్ల మేరకు నష్టం వాటిల్లినట్టు ఏసీబీ కేసు నమోదు చేసింది. ఈ గంధపు చెక్కలను విక్రయించడం వల్ల వచ్చిన నగదును హవాలా మార్గంలో పలు విదేశీ కంపెనీల్లో పెట్టుబడి పెట్టినట్టు గుర్తించిన ఈడీ మొత్తం ఆరుగురిపై కేసు నమోదు చేసింది. ఆ తర్వాత సీబీఐ విచారణ చేపట్టగా, కేసు విచారణ ప్రత్యేక సీబీఐ కోర్టులో సాగింది. కేసులో 2023లో సీబీఐ, గత మార్చిలో ఈడీ చార్జిషీట్లు సమర్పించాయి. ఇందులో మాజీ మంత్రి పొన్ముడి, ఆయన కుమారులు గౌతమ్ శిఖామణి, అశోక్ శిఖామణి పేర్లను కూడా జతచేశారు. ఈ కేసు విచారణ గురువారం సీబీఐ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి జె.ఓంప్రకాష్ ముందు విచారణకు రాగా, ఆరోపణలు ఎదుర్కొంటున్న వారంతా కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారికి చార్జిషీటు ప్రతులను అందజేశారు. అదేసమయంలో ఈ కేసు విచారణలో వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపునివ్వాలని కోరుతూ పొన్ముడి తరపున పిటిషన్ వేయగా, దాన్ని విచారణకు స్వీకరించిన న్యాయమూర్తి తీర్పును ఈ నెల 21వ తేదీకి వాయిదా వేశారు. అలాగే, ప్రధాన కేసు తదుపరి విచారణను జూలై 7వ తేదీకి వాయిదా వేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ప్యారీస్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఓ ప్రకటనలో తెలిపింది.

కేకేనగర్ : కావేరి రంగన్‌నగర్, కేకేరోడ్డు, లోకయ్యకాలనీ, దశరథపురం, ఆర్కాడు రోడ్డు, బాలాజీనగర్, అరుణాచలం రోడ్డు, కుమరన్‌కాలనీ, గాంధీనగర్, దేవరాజ్‌నగర్, ఎస్ఎస్ఆర్ పంకజం రోడ్డు, భరణికాలనీ, కావేరి ఆస్పత్రివీధి, 80 అడుగులరోడ్డు, ఎంజీ చక్రపాణివీధి, మునిస్వామివీధి, కస్తూరివీధి, వినాయగంవీధి, కామరాజర్‌రోడ్డు, వెంకటేశన్‌నగర్

కోవూరు: అంబాళ్‌నగర్, రామ్‌నగర్, అన్నావీధి, కనకాక్షివీధి, ఆనంద వినాయగర్‌వీధి, అంబేద్కర్‌వీధి, కుండ్రత్తూరు మెయిన్ బజార్.

షోలింగనల్లూరు: గౌరివాక్కం, ఆదినాథ్‌నగర్, బాలాజీనగర్, సుశీలనగర్, విజయనగరం, వేలచ్చేరి మెయిన్‌రోడ్డు, జయలక్ష్మీనగర్, విష్ణురాజాపురం, బెల్‌నగర్ 1 నుండి 5వీధులు, పరుశురామ్ అవెన్యూ, నార్త్‌బట్ మెయిన్‌రోడ్డు, జేకే అవెన్యూ, ఆర్ఎస్ ఎన్‌క్లేవ్, రూబంప్లాట్స్, యునైటెడ్ కాలనీ, సాయిరామ్‌నగర్ మెయిన్ రోడ్డు, పార్కు, సిద్ధార్థ్ అపార్ట్‌మెంట్.

రాజకీల్పాక్కం: రిజిస్ట్రేషన్ కార్యాలయం, షోలయూర్, వెంకటరామన్‌వీధి, మారుతినగర్ 2వ మెయిన్‌రోడ్డు, వేళచ్చేరి మెయిన్‌రోడ్డు, స్వామిస్ట్రీట్, మరమలైఅడిగలర్‌వీధి, అవ్వయ్యార్‌వీధి, సభాకాలనీ మెయిన్‌వీధి,

రెడ్‌హిల్స్: సోత్తుపెరుంబేడు, అల్లిమేడు, మెట్టు సూరపేడు పాళయం, వరక్కాడు

ఈస్ట్ మొగప్పేర్: మోహన్‌రావునగర్, భారతీదాసన్‌నగర్, కొంగునగర్, వీజీపీనగర్, 6వ బ్లాక్ మెయిన్‌రోడ్డు, సాదర్‌వార్‌వీధి, వెళ్లాలర్‌వీధి

కుండ్రత్తూరు : అలగేశనర్‌నగర్, పెరియార్‌నగర్, సరస్వతినగర్, కోదండంరోడ్డు, అంబేద్కర్‌నగర్, రాజీవ్‌గాంధీనగర్, భారతీయర్‌నగర్, నందబాక్కం, తిరుముడివాక్కం, సంబంధంనగర్, లక్ష్మీనగర్, తాయిసుందరంనగర్, గొల్లర్‌వీధి, విజయరాజానగర్, వళుదలమ్‌గ్రామం, మెట్రోగ్రాండ్ సిటీ.

తిరువాన్మియూర్ : ఇందిరానగర్, పెరియార్‌నగర్, కామరాజ్‌నగర్, ఎల్‌బీరోడ్డు, తిరువళ్లువర్‌వీధి, శాస్త్రినగర్, అవ్వైనగర్, రాజాజీనగర్, నేతాజీనగర్, కన్నప్పర్‌నగర్, ఎజీఎస్‌కాలనీ, స్వామినాథర్‌నగర్, ఎజేపీఈఏ నగర్, కలత్తుమేడు, పీటీసీవీధి, సెల్వరాజ్ అవెన్యూ, ఈస్ట్‌కోస్ట్‌రోడ్డు, పాతమహాబలిపురం రోడ్డు. **పల్లావరం :** ఇందిరాగాంధీవీధి, దండుమారియమ్మన్‌కోవెల్‌వీధి, జీఎస్టీరోడ్డులో పమ్మళ్ మెయిన్ రోడ్డు ఏ2బీ హోటల్, మాలిక్‌వీధి, నాగరత్నంవీధి, చెన్నై సిల్క్స్, ఒలంపియా, అతుల్యా టవర్స్ తదితర ప్రాంతాల్లో నేడు విద్యుత్ వినియోగం నిలిపివేయనున్నట్లు విద్యుత్ బోర్డు ఓ ప్రకటనలో తెలిపింది.

18న ద్రావిడర్ కళగం నిరసన ప్రదర్శన

పెరంబూర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): తమిళ ప్రజల చరిత్రను కప్పిపుచ్చేలా వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వ తీరును ఖండిస్తూ ఈ నెల 18న నిరసన ప్రదర్శన చేపట్టనున్నట్లు ద్రావిడర్ కళగం అధ్యక్షుడు కె.వీరమణి తెలిపారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో... సరైన ఆధారాలు ఉన్నప్పటికీ కీళడి పురావస్తు తవ్వకాలను నిలిపివేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నారు. కీళడి తవ్వకాలు సత్వరం చేపట్టాలని కోరుతూ 18న నగరంలో నిరసన ప్రదర్శన చేపట్టనున్నట్లు వీరమణి తెలిపారు.

రేషన్ దుకాణ నిర్మాణానికి భూమి పూజ



భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎస్.చంద్రన్ తదితరులు

తిరుత్తణి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి మండలం మద్దూరు గ్రామంలో రేషన్‌దుకాణం నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే ఎస్.చంద్రన్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ పేదప్రజల కోసం అన్నా గ్రామ మరుమలర్చి పథకం కింద రూ.13.30 లక్షలతో రేషన్ దుకాణ నిర్మాణం పనులు చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఇంజనీర్ ధర్మేష్, మండల డీఎంకే కార్యదర్శులు కృష్ణన్, విజయకుమార్, మీసై వెంకటేష్ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో ముగ్గురి మృతి

● తెన్‌కాశి పోలీసుల విచారణ



ఆస్పత్రి సిబ్బందితో మాట్లాడుతున్న పోలీసులు

ప్యారీస్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): తెన్‌కాశిలోని ఓ వృద్ధాశ్రమంలో ఆహారం వికటించడంతో ముగ్గురు దుర్మరణం చెందడంపై ఆహార భద్రతా విభాగం అధికారులు, పోలీసులు కేసు నమోదు చేశారు. తెన్‌కాశి జిల్లా సుందరపాండ్యపురంలోవున్న ఓ వృద్ధాశ్రమంలో 60 మందికి పైగా ఆశ్రయం పొందుతున్నారు. రోజూలాగే బుధవారం రాత్రి ఆహారం తీసుకున్న తర్వాత 11 మంది అజీర్తికి గురికాగా, వారిని వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో చికిత్స ఫలించక ముగ్గురు మృతిచెందారని, మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. సమాచారం అందుకున్న పోలీసులతో పాటు గురువారం ఆ వృద్ధాశ్రమానికి వెళ్ళిన జిల్లా ఆహార భద్రతా విభాగం అధికారులు ఆశ్రమ నిర్వాహకులు రాజేంద్రన్‌ను ప్రశ్నించారు.. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చర్యలు చేపట్టారు.

మదురైలో రౌడీ హత్య

అడయార్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మదురైలో బుధవారం అర్థరాత్రి ఓ రౌడీ హత్యకు గురయ్యాడు. కొందరు దుండగులు ఇంటిలో ఉన్న రౌడీని కిరాతకంగా హత్య చేసి పారిపోయారు. పోలీసులు వెల్లడించిన వివరాల మేరకు.. మదురై ఆరపాళెయం ప్రాంతానికి చెందిన అజయ్ ప్రసన్న కుమార్ (24) అనే యువకుడిపై హత్యాయత్నం, దోపిడీ సహా మొత్తం 12 కేసులున్నాయి. గత కొంతకాలంగా జైలులో ఉంటున్న అజయ్.. నాలుగు రోజుల క్రితమే బెయిల్‌పై విడుదలయ్యాడు. ఈ నేపథ్యంలో అజయ్ స్నేహితుడు ధనశేఖరన్‌పై కొందరు రౌడీలు దాడి చేశారు. దీంతో ధనశేఖర్‌ను వెంటబెట్టుకుని అజయ్ ప్రతి దాడులకు పాల్పడ్డాడు. దీంతో ప్రత్యర్థి ముఠా అజయ్ ఇంటికి వచ్చి నిద్రపోతున్న అతడిపై మారణాయుధాలతో దాడి చేయడంతో అజయ్ అక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి, పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు.

పెయింటర్ హత్య కేసులో నిర్లక్ష్యం

● సీఐ, ఇద్దరు ఎస్ఐల సస్పెన్షన్

అడయార్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లా కాట్టుమన్నార్‌కోయిల్ పెయింటర్ ప్రవీణ్ రాజ్ (23) అనే హత్య కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు కాట్టుమన్నార్ కోయిల్ పోలీస్ స్టేషన్ సీఐ, ఎస్ఐలు రాజా, అన్బళగన్‌లను జిల్లా ఎస్పీ జయకుమార్ సస్పెండ్ చేశారు. చెన్నై నగరంలో పెయింటర్‌గా పనిచేసే ప్రవీణ్ రాజ్ తన స్నేహితుడి వివాహానికి సొంతూరు వెళ్ళగా, అక్కడ కొందరు యువకులతో ఏర్పడిన మనస్పర్థల కారణంగా హత్యకు గురయ్యాడు. అయితే, ఈ హత్య జరుగుతుందని పది రోజుల క్రితమే పోలీసులకు సమాచారం అందించినప్పటికీ పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా నడుచుకున్నారు. దీంతో ఇన్‌స్పెక్టర్, ఎస్ఐలపై జిల్లా ఎస్పీ చర్యలు తీసుకున్నారు.

ఐఏఎస్ అధికారికి విధించిన జైలుశిక్ష నిలిపివేత

పెరంబూర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కోర్టు ఉత్తర్వుల ధిక్కరణ ఆరోపణలకు గురైన ఐఏఎస్ అధికారి అన్సుల్‌మిశ్రాకు విధించిన నెల రోజుల జైలు శిక్ష మద్రాసు హైకోర్టు నిలిపివేసింది. కోర్టు ఆదేశాలు అమలుచేయలేదంటూ తమిళ అర్బన్ హాబిటాట్ డెవలప్‌మెంట్ బోర్డు ఎండీగా ఉంటూ ప్రస్తుతం చెన్నై మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ డైరెక్టర్‌గా ఉన్న అన్సుల్‌మిశ్రాకు నెల రోజుల జైలుశిక్ష, బాధితుడైన పిటిషనర్‌కు రూ.25 వేలు పరిహారం చెల్లించాలంటూ మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. ఈ పరిహారాన్ని అన్సుల్‌మిశ్రా వేతనం నుంచి జమచేయాలని హైకోర్టు ఆదేశించింది. ఈ ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ అన్సుల్ మిశ్రా తరపున అప్పీలు పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్ గురువారం విచారించిన మద్రాసు హైకోర్టు, ఐఏఎస్ అధికారి అన్సుల్‌మిశ్రాకు విధించిన నెల రోజుల జైలుశిక్ష నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే, ఆయనకు విధించిన రూ.25 వేల పరిహారం మూడు వారాల్లో డిపాజిట్ చేసేందుకు అవకాశం కల్పించింది.

అత్యాచారం కేసులో నిందితుడికి 13ఏళ్ళ జైలు

ప్యారీస్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ సమీపంలో చిన్నారిని కిడ్నాప్ చేసి అత్యాచారానికి పాల్పడిన యువకుడికి న్యాయస్థానం 13ఏళ్ళ జైలుశిక్ష విధించింది. దిండుగల్ ప్రాంతానికి చెందిన పాండి (30) అనే యువకుడిపై 2019వ సంవత్సరం బాలికను కిడ్నాప్ చేసి అత్యాచారానికి పాల్పడాడంటూ చిన్నారి తల్లిదండ్రులు నత్తం మహిళా పోలీసులకు ఫిర్యాదు చేశారు. పాండిని పోక్సో చట్టం కింద అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు. ఐదేళ్ళకు పైగా సాగిన ఈ కేసు విచారణ పూర్తైన నేపథ్యంలో, దిండుగల్ మహిళా కోర్టు న్యాయమూర్తి సమక్షంలో నిందితుడు పాండిని హాజరుపరచారు. నిందితుడికి 13ఏళ్ళ జైలుశిక్షతో పాటు రూ.15వేలు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. కాగా, ఈ ఏడాది 1 వరకు దిండుగల్ మహిళా కోర్టు 32 పోక్సో కేసులపై తీర్పు వెలువరించడం గమనార్హం.

పొదల్లో నవజాత శిశువు

తిరుత్తణి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి ప్రభుత్వాస్పత్రి వెనుకనున్న ఖాళీ స్థలంలో నవజాత శిశువును గుర్తుతెలియని వ్యక్తులు పారేశారు. వివరాల్లోకి వెళ్తే బుధవారం ఉదయం తిరుత్తణి ప్రభుత్వాసుపత్రి వెనుక ఖాళీ స్థలం నుంచి పసిబిడ్డ ఎడుపు వినిపించడంతో అక్కడి స్థానికులు వెళ్ళిచూడగా, చెట్ల పొదల్లో ఓ పసిబిడ్డ కనిపించింది. దీంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆ బిడ్డను ప్రభుత్వాస్పత్రిలోని పిల్లల అత్యవసర వార్డుకు తరలించారు. ప్రస్తుతం ఆ బిడ్డ క్షేమంగా ఉందని, వైద్యులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు చెట్ల పొదల్లో బిడ్డను పారేసిన వ్యక్తుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.



నవజాత శిశువు

గంజాయి ముఠాతో కుమ్మక్కు

● ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లపై సస్పెన్షన్ వేటు

ప్యారీస్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): గంజాయి ముఠాతో సంబంధాలున్న ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లపై సస్పెన్షన్ వేటుపడింది. విల్లుపురం జిల్లా అరగండనల్లూరు పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుళ్లుగా పనిచేసిన దేవదాస్, దీనదయాళన్ అక్రమంగా తరలించిన గంజాయి విక్రయించేందుకు సహకరించారని ఆరోపిస్తూ వారిపై జిల్లా ఎస్పీకి పలువురు ఫిర్యాదు చేశారు. దీంతో వారిని విల్లుపురంలోని రిజర్వు పోలీసు విభాగానికి బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో, గంజాయి ముఠాతో సంబంధాలున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న హెడ్ కానిస్టేబుళ్లపై నమోదైన కేసు విచారణలో వీరు నేరం చేసినట్లు రుజువైంది. దీనితో శాఖ పరమైన చర్యలు తీసుకున్న విల్లుపురం జిల్లా ఎస్పీ శరవణన్ వారిని సస్పెండ్ ఉత్తర్వులు జారీచేశారు.

స్నేహితురాలు చదువుతున్న బడిలో చేర్చలేదంటూ విద్యార్థిని ఆత్మహత్య

పెరంబూర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): స్నేహితురాలు చదువుతున్న బడిలో చేర్చలేదంటూ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మదురైలో చోటుచేసుకుంది. మదురై తల్లాకుళం విశాలాక్షిపురానికి చెందిన ప్రియ భర్త పదేళ్ల క్రితం మృతిచెందడంతో ఇద్దరు కుమారులు, కుమార్తెతో కలసి జీవిస్తోంది. కుమార్తె అర్చన (14) అదే ప్రాంతంలోని పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. ఈ నేపథ్యంలో, అర్చన స్నేహితులురాలు ఓ ప్రైవేటు పాఠశాలలో చేరినట్లు సమాచారం. దీంతో, తనను కూడా ప్రైవేటు పాఠశాలలో చేర్పించాలని అర్చన తల్లిని ఒత్తిడి చేయగా, ఆమె వప్పుకోలేదు. దీంతో, మనస్తాపం చెందిన అర్చన బుధవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై తల్లాకుళం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

తిరుత్తణి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణి సమీపంలోని చిన్న కడంబూరులో పేకాడుతున్న ఐదుగురు జూదగాళ్లను పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే మంగళవారం సాయంత్రం చిన్న కడంబూరు గ్రామంలో కొంతమంది పేకాట నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఎస్పీ శ్రీనివాసన్ నేతృత్వంలోని పోలీసులు, ఆ ప్రాంతానికి చేరుకుని ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుండి రూ.85వేలు నగదు, ఐదు సెల్‌ఫోన్లు, బైక్ స్వాధీనం చేసుకున్నారు. ఆర్కేపేటకు చెందిన పంచాయతీ కార్యదర్శి జగదీష్, అరక్కోణంకు చెందిన రాజు, కాట్పాడికి చెందిన పచ్చయప్పన్, తిరుత్తణినికి చెందిన శివ , షోలింగనల్లూరుకు చెందిన బాలమురుగన్‌లను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అంబులెన్స్ ఢీకొని మహిళ మృతి

పెరంబూర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్‌లో లైసెన్స్ లేని డ్రైవర్ నడిపిన అంబులెన్స్ ఢీకొని మహిళ మృతిచెందింది. కోవై గౌండంపాళయం ప్రభు నగర్‌కు చెందిన నీలావతి (60) పీలమేడు, మహేష్ నగర్ తదితర ప్రాంతాల్లోని ఇళ్లలో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. బుధవారం పనులు ముగించుకుని ఇంటికి వెళ్లేందుకు అవినాశి రోడ్డు, పీలమేడు వరదరాజ మిల్ సమీపంలో రోడ్డు దాటి, బస్ కోసం బస్టాండ్ వేచి ఉంది. ఈ సమయంలో అటుగా వచ్చిన ప్రైవేటు అంబులెన్స్ ఢీకొనడంతో నీలావతి తీవ్రంగా గాయపడింది. చుట్టుపక్కల వారు ఆమెను వెంటనే కోవై ప్రభుత్వాసుపత్రికి తరలించగా, ఆమె అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. కాగా, ప్రమాదానికి కారణమైన అంబులెన్స్ డ్రైవర్ మదన్‌కుమార్ ఎల్ఎల్ఆర్ మాత్రమే ఉంచుకుని, అతివేగంగా అంబులెన్స్ నడిపినట్లు ట్రాఫిక్ పోలీసుల విచారణలో తేలింది. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు మదన్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

కార్పొరేషన్ లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

ప్యారీస్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక మాధవరం బస్ టెర్మినల్ జంక్షన్‌లో ఏపీఎస్ఆర్టీసీ బస్సు కార్పొరేషన్ లారీని ఢీకొన్న ఘటనలో 10 మంది ప్రయాణికులకు గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. మాధవరం బస్‌టెర్మినల్ నుండి సుమారు 30 మందికి పైగా ప్రయాణికులతో గురువారం ఉదయం 10.30 గంటలకు తిరుపతికి ఏపీఎస్ఆర్టీసీ బస్సు బయలు దేరింది. డ్రైవర్ రామసుందరరావు నడుపుతున్న ఈ బస్సు మాధవరం జంక్షన్ మీదుగా మధురవాయల్ చేరుకుంటుండగా రోడ్డు పక్కన నిలిపివున్న కార్పొరేషన్ లారీని ఢీకొంది. బస్సు ముందుభాగం నుజ్జునుజ్జు కాగా, డ్రైవర్‌తో పాటు 10 మంది ప్రయాణికులు గాయపడ్డారు. సమాచారం తెలిసి అక్కడికి చేరకున్న ట్రాఫిక్ పోలీసులు, క్షతగాత్రులను అంబులెన్స్ ద్వారా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు.

ప్రభుత్వాస్పత్రిలో విరిగిపడిన ఫ్యాను

పెరంబూర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): తేని జిల్లా బోడి ప్రభుత్వాస్పత్రిలో ఫ్యాను మంచంపై పడిన ఘటనలో పసికందు, తల్లి తృటిలో తప్పించుకున్నారు. జక్కమ్మనాయకన్‌పట్టి గ్రామానికి చెందిన ప్రవీణ సిజేరియన్ ద్వారా బిడ్డకు జన్మనిచ్చింది. ప్రసవం జరిగిన తర్వాత ఆమెను వార్డుకు తరలించారు. అక్కడ మంచం సరిగా లేకపోవడంతో ఆమెను మరో మంచంపైకి చేర్చారు. ఈ నేపథ్యంలో, ప్రవీణను మొదట ఉంచిన మంచంపై ఉన్న ఫ్యాను హఠాత్తుగా పడింది. ఈ మంచం సరిగా లేదని ప్రవీణను మరో మంచం వద్దకు వెళ్లడంతో ప్రమాదం తప్పిందని బంధువులు పేర్కొన్నారు.



మంచంపై పడిన ఫ్యాను

ఆ రోజు చాలా ఫీలయ్యాను

● మారి సెల్వరాజ్ ● 20న 'డీఎన్‌ఏ' రిలీజ్

'పరియేరుమ్ పెరుమాళ్' సినిమా కథను తొలిసారి వినిపించింది హీరో అధర్వకేనని, కానీ నాటి పరిస్థితుల కారణంగా అది కార్యరూపం దాల్చలేదనీ, దీంతో సీనియర్ నటుడు మురళి తనయుడే ఈ కథను నిరాకరించారని ఎంతగానో బాధపడ్డానని ప్రముఖ దర్శకుడు మారి సెల్వరాజ్ అన్నారు. ఒలింపియా మూవీస్ పతాకంపై నిర్మాత జయంతి అంబేత్‌కుమార్ నిర్మాణ సారథ్యంలో నెల్సన్ వెంకటేశన్ దర్శకత్వంలో అధర్వ మురళి హీరోగా నటించిన తాజా చిత్రం 'డీఎన్‌ఏ'. నిమిషా సజయన్, మానస చౌదరి, రమేష్ తిలక్, బాలాజీ, శక్తివేల్ విజి చంద్రశేఖర్, రిత్విక, సుబ్రహ్మణ్య శివ, కరుణాకరన్ తదితరులు నటించారు. ఈ నెల 20వ తేదీ ఈ చిత్రం విడుదల కానున్న నేపథ్యంలో చిత్రం



ఆడియో రిలీజ్ కార్యక్రమంలో చిత్ర బృందం

చిత్రజ్యోతి

ఆడియో, ట్రైలర్‌ను నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో విడుదల చేశారు. ఈ చిత్రానికి శ్రీకాంత్ హరిహరన్, సహి శివ, ప్రవీణ్ సైవి, సత్య ప్రకాష్ అనల్ ఆకాష్ అనే ఐదుగురు సంగీత దర్శకులు బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ అందించారు.దర్శకుడు మారి సెల్వరాజ్, రాజు మురుగన్, గణేష్ కే బాబు, హేమంత్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై ఆడియో రిలీజ్ చేశారు.హీరోయిన్ నిమిషా మాట్లాడుతూ, 'డీఎన్‌ఏ' మూవీ నాకు ఎంతో స్పెషల్. దివ్య పాత్రలో నటించడం కొంచెం ఛాలెంజింగ్ అనిపించిందన్నారు. మారి సెల్వరాజ్ మాట్లాడుతూ, 'దర్శకుడు నెల్సన్ ఇప్పటివరకు రూపొందించిన ప్రతి పాత్రకు ఒక అంతర్గతంగా మరో పాత్ర ఉంటుంది.ప్రతి చిత్రం భిన్నంగా ఉంటుంది' అన్నారు. హీరో అధర్వ మురళి మాట్లాడుతూ, 'మారి సెల్వరాజ్ ఏదైనా కథ వినిపిస్తే అందులో నటించేందుకు సిద్ధంగా ఉన్నాను. ఈ టైటిల్ చెప్పినపుడు ఇది జెనెటిక్ పరమైన సైన్స్ ఫిక్షన్ స్టోరీగా భావించాను. కానీ, డీఎన్ఏ అంటే 'దివ్య అండ్ ఆనంద్' అని చెప్పి ఆశ్చర్యపరిచారు. ఒక మంచి చిత్రంలో నటించినందుకు దర్శక నిర్మాతలకు ధన్యవాదాలు' తెలిపారు. దర్శకుడు నెల్సన్ వెంకటేశన్ మాట్లాడుతూ, 'అధర్వ - నిమిషా లేకుంటే ఈ సినిమా లేదు. ఈ విషయం సినిమా చూసేటపుడు మీకే అర్థమవుతుంది. నా గత మూడు చిత్రాలకు భిన్నమైనది. ఒక దర్శకుడుగా ఎక్కడా రాజీపడకుండా 'డీఎన్‌ఏ'ను రూపొందించాను' అని పేర్కొన్నారు.

'మానుషి' చిత్రానికి సెన్సార్ సర్టిఫికెట్ లభించేనా?

ప్రముఖ దర్శకుడు వెట్రిమారన్ నిర్మాతగా నిర్మించిన 'మానుషి' చిత్రానికి సెన్సార్ సర్టిఫికెట్ లభించలేదు. దీంతో నిర్మాత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఇందులో సెన్సార్ సర్టిఫికెట్ నిరాకరించడానికి గల కారణాలను సెన్సార్ కమిటీ సభ్యులు వెల్లడించలేదు. నిర్మాతగా నా వివరణ కూడా కోరలేదు. వాక్ స్వాతంత్ర్యం పరిధిలోకి రాని, రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉండే సన్నివేశాలను తొలగించేందుకు సిద్ధం. కానీ, ఆ అవకాశాన్ని సెన్సార్ బోర్డు సభ్యులు ఇవ్వలేదు. అందువల్ల నిపుణుల కమిటీని ఏర్పాటు చేసి ఈ సినిమాకు సెన్సార్ సర్టిఫికెట్ ఇవ్వాలి' అని కోరారు. దీన్ని హైకోర్టు విచారణకు స్వీకరించగా చిత్రాన్ని మళ్ళీ సెన్సార్ చేస్తామని సెన్సార్ బోర్డు తరఫున హాజరైన న్యాయవాది కోర్టుకు వెల్లడించారు. దీంతో



'మానుషి'లో ఆండ్రియా

తదుపరి విచారణను ఈ నెల 17వ తేదీకి వాయిదా వేశారు. కాగా, ఇళయరాజా సంగీతం అందించిన ఈ చిత్రానికి గోపి నయినార్ దర్శకుడు. ఉగ్రవాదిగా అనుమానించిన ఒక మహిళను స్టేషన్‌కు తీసుకెళ్లి చిత్ర హింసలకు గురిచేసే అంశాన్ని ప్రధాన ఇతివృత్తంగా తీసుకుని మూవీని రూపొందించారు. ఇప్పటికే విడుదలైన ఈ మూవీ ట్రైలర్ చర్చతో పాటు వివాదానికి కూడా దారితీసింది.

అజిత్ - ఆధిక్ కాంబో రిపీట్?

'గుడ్ బ్యాడ్ అగ్లీ' వంటి హిట్ మూవీ తర్వాత అగ్రహీరో అజిత్ కుమార్, దర్శకుడు ఆధిక్ రవిచంద్రన్ కాంబినేషన్ రిపీట్‌కానుంది. దీనిపై ఈ నెలాఖరు లేదా వచ్చే నెల మొదటివారంలో అధికారికంగా ప్రకటన వెలువడనుంది. ఈ కొత్త ప్రాజెక్టుకు సంబంధించి మూవీ టైటిల్‌తో పాటు టీజర్‌ను కూడా ఆ రోజే విడుదల చేయాలని హీరో అజిత్ భావించారు. అందుకే ఈ సినిమా ప్రకటనపై జాప్యం జరిగింది. తనకు బాగా నచ్చిన చరణ్, చిరుత్తై శివ, హెచ్.వినోద్ వంటి దర్శకులకు అజిత్ వరుస అవకాశాలు ఇచ్చిన విషయం తెల్సిందే. అదేవిధంగా 'గుడ్ బ్యాడ్ అగ్లీ' తర్వాత దర్శకుడు ఆధిక్ రవిచంద్రన్‌కు మళ్ళీ ఛాన్స్ ఇచ్చారు. అజిత్‌కు ఇష్టమైన కార్ రేసింగ్ పోటీలు లేని సమయంలోనే ఈ సినిమా షూటింగ్ ప్రారంభించాలని అజిత్ నిర్ణయించారు. ఈ మూవీకి సంగీత దర్శకుడుగా జీవీ ప్రకాష్ కుమార్‌ను ఎంపిక చేసినట్టు సమాచారం.



అజిత్ కుమార్ - ఆధిక్ రవిచంద్రన్

అందం కోసం ప్లాస్టిక్ సర్జరీనా?



అతుల్య రవి

ముఖారవిందం కోసం తాను ప్లాస్టిక్ సర్జరీ చేయించుకున్నట్టు వస్తున్న వార్తల్లో ఏమాత్రం నిజం లేదని హీరోయిన్ అతుల్య రవి స్పష్టం చేశారు. మరింత అందంగా కనిపించేందుకు అతుల్య రవి ప్లాస్టిక్ సర్జరీ చేయించుకుందంటూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం సాగుతోంది. దీనిపై ఆమె వివరణ ఇచ్చారు. తాను ఎలాంటి సర్జరీ చేయించుకోలేదని, సహజంగానే తాను అందంగా ఉంటానని ఆమె పేర్కొన్నారు. సాధారణంగా పలువురు సినీ సెలెబ్రిటీలు అందంగా కనిపించేందుకు ఫేస్ సర్జరీలు చేయించుకోవడం ఆనవాయితీ. ఈ కోవలో నయనతార, శృతిహాసన్ తదితరులు ముఖానికి ప్లాస్లిక్ సర్జరీ చేయించుకున్నారు. హాలీవుడ్, బాలీవుడ్‌లో ఇది సహజమే. ఇపుడు ఈ సంస్కృతి కోలీవుడ్‌లోనూ ఎక్కువైంది. ప్రముఖ హీరో ఒకరు కూడా ఈ చికిత్సను చేయించుకుంటున్నారే టాక్ ప్రచారంలో ఉంది.

మైలాపూరు పరిసరాల్లోని సుప్రసిద్ధ సప్త శైవక్షేత్రాల్లో మూడవదైన కామాక్షి సమేత వెళ్ళీశ్వరాలయం అక్కడి దక్షిణ మాఢవీధిలో ఉంది. అత్యంత ప్రాచీనమైన ఈ ఆలయాన్ని దక్షిణాభిముఖంగా నిర్మించారు. ఈ ఆలయాన్ని దర్శిస్తే శుక్రుడి కటాక్షం ప్రాప్తిస్తుంది. నేత్ర సంబంధ రోగాలు నయమవడంతో పాటు కంటి చూపు కూడా మెరుగవుతుందని శైవాగమపండితులు చెబుతారు. ఆలయాన్ని దర్శించుకుంటే శుక్రమహాదశ లభించి, వివాహం, విద్యాయోగం, రాజ్యాధికారం లభిస్తాయని భక్తుల ప్రగాఢవిశ్వాసం. శుక్రుడు లేదా శుక్రగ్రహాన్ని తమిళంలో 'వెళ్ళి భగవాన్' (వెండి దేవుడు) అని పిలుస్తారు. కనుకనే ఈ ఆలయంలోని మూలవిరాట్టును 'వెళ్లీశ్వరుడు' అని పిలుస్తున్నారు.

- టి.నగర్, ఆంధ్రజ్యోతి

దృష్టిని ప్రసాదించే వెళ్లీశ్వరుడు

● శుక్రభగవానుడి అనుగ్రహ క్షేత్రం

● వామనావతార సంబంధిత ఆలయం



ఆధ్యాత్మికం

ఆలయ రాజగోపురం

స్థలపురాణం...

మహాబలి చక్రవర్తి ఎన్నోయాగాలు చేస్తూ, నిరుపేదలకు దాన ధర్మాలు చేసి కీర్తి గడించారు. బలిచక్రవర్తి కీర్తి ప్రతిష్ఠలు పెరుగుతుండటంతో తన పదవికి ముప్పువాటిల్లుతుందని ఆందోళన చెందిన దేవేంద్రుడు మహావిష్ణువును ఆశ్రయించి తన పదవిని కాపాడమని ప్రాధేయపడ్డాడు. మహావిష్ణువు వామనావతారం దాల్చి బలి చక్రవర్తి నుంచి మూడడుగుల నేలను దానం కోరాడు. వచ్చినది మహా విష్ణువని గ్రహించిన శుక్రాచార్యుడు బలిచక్రవర్తిని దానం ఇవ్వకుండా అడ్డుకోవాలని భావించాడు. బలిచక్రవర్తి దానం చేయడానికి కమండలం పట్టుకున్నప్పుడు శుక్రాచార్యుడు కందిరీగ రూపంలో నీరు రాకుండా అడ్డుకున్నాడు. ఇది గమనించి మహావిష్ణువు దర్భపుల్లను తీసుకుని పొడవడంతో శుక్రాచార్యుడి ఓ కన్ను దెబ్బతిని చూపు పోయింది. శుక్రాచార్యుడు నేత్ర దృష్టి పొందటానికి పరమేశ్వరుడి అనుగ్రహం కోసం తపమాచరించాడు. ప్రస్తుతం వెళ్ళీశ్వరాలయమున్న ప్రాంతంలో శివలింగాన్ని ప్రతిష్ఠించి తపస్సు చేయడంతో పరమేశ్వరుడు ప్రత్యక్షమై ఆయనకు కంటి చూపు ప్రసాదించాడనే గాథ ఉంది.



కామాక్షి సమేత వెళ్ళీశ్వరర్



వెలుపలి ప్రాకార మండపం

ఆలయవిశేషాలు.. :

ఈ ఆలయంలో శుక్రుడిని ప్రార్థిస్తే కంటి రోగాలు నయమవుతాయని,. కంటి చూపు మెరుగవుతుందని భక్తుల విశ్వాసం. కామాక్షి అమ్మవారిని వేడుకుంటే తలచిన కార్యం నెరవేరుతుందని, వివాహం జరుగుతుందని, వళ్ళీ దైవానై సమేత మురుగప్పెరుమాన్‌ను దర్శిస్తే సంపదలు పెరిగి, వివాహాటంకాలు తొలగుతాయని శైవపండితులు చెబుతున్నారు.. అష్టమి దినాన భైరవుడిని ప్రార్థిసే శత్రుభయం తొలగి, కార్యసిద్ధి కలుగుతుందని కూడా భక్తుల విశ్వాసం.

ఎలావెళ్ళాలి? :

చెన్నై నగరంలోని పలు ప్రాంతాల నుండి మైలాపూరుకు మహానగర రవాణా సంస్థ బస్సులు నడుపుతున్నారు. ఫోర్ట్ స్టేషన్ నుండి మైలాపూరు ఎంఆర్‌టీఎస్ రైళ్లు కూడా నడుస్తున్నాయి. సిటీ బస్సులో బయలుదేరి మైలాపూరు ట్యాంక్ బస్‌స్టాప్ వద్ద దిగితే అక్కడికి అర కిలోమీటరు దూరంలో కపాలీశ్వరాలయానికి కూతవేటు దూరంలో వెళ్ళీశ్వరాలయం ఉంది. ఈ ఆలయాన్ని రోజూ ఉదయం 6 నుండి 11.30 గంటల వరకు, మళ్ళీ సాయంత్రం 4 నుండి రాత్రి 9 గంటల వరకు తెరచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.



ముత్తుకుమారస్వామి సన్నిధి

ఆలయ వైభవం...

ఈ ఆలయం వెయ్యేళ్ల నాటిదని పురావస్తు పరిశోధకులు చెబుతున్నారు. ఆలయం వద్ద ఐదంతస్తుల రాజగోపురం భక్తులను ఆహ్వానిస్తుంది. లోపలకు వెళితే దక్షిణాభిముఖంగా ఓ సన్నిధిలో సిద్ధి, బుద్ధి సమేత వినాయకుడు దర్శనమిస్తారు. ఆయనకు ఎదురుగా తెన్‌కూర్ సెల్వ వినాయకుడు ఆశీనుడై ఉంటారు. తూర్పుదిశగా ఉన్న గర్భాలయంలో వెళ్ళీశ్వర స్వామి లింగ తిరుమేనితో భక్తులను అనుగ్రహిస్తున్నారు. నాగాభరణ అలంకారంలో ఇక్కడి పరమేశ్వరుడిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈశ్వరుడి సన్నిధికి ఎదురుగా 'నందియం పెరుమాన్' (నందీశ్వరుడు) ప్రత్యేక మండపంలో ఉన్నారు. నందీశ్వరుడి వెనుక ధ్వజస్తంభం, బ్రహ్మశక్తిపీఠం ఉన్నాయి. గర్భాల ప్రవేశ ద్వారానికిరువైపులా విఘ్నేశ్వరుడు, మురుప్పెరుమాన్ ఉన్నారు. పరమేశ్వరుడి సన్నిధికి కుడివైపున, దక్షిణాభిముఖంగా ప్రత్యేక సన్నిధిలో కామాక్షి అమ్మవారు దర్శనమిస్తున్నారు. చతుర్భుజాలతో, రెండు చేతులలో పుష్పాలు, మరో రెండు చేతులలో అభయ, వరద ముద్రలతో కనిపిస్తున్నారు. అమ్మవారి గర్భాలయంలో కంచి శంకరాచార్యులు ప్రతిష్ఠించిన శ్రీచక్రం కూడా ఉంది. స్వామివారి గర్భాలయ గోష్ఠంలో మహాగణపతి, దక్షిణామూర్తి, లింగోద్భవుడు, బ్రహ్మ, చండికేశ్వర్లున్నారు. ఈ దేవతామూర్తుల తర్వాత దుర్గాదేవి దక్షిణాభిముఖంగా పూజలందుకుంటున్నారు. అంతర ప్రాకారంలో వినాయకుడు, శైవభక్తశిఖామణులు అప్పర్ (తిరునావుక్కరసర్), సంబందర్, సుందరర్, మాణిక్యవాచకర్‌తోపాటు శివసూర్యుడు, సప్తకన్నికలు, వీరభద్రుడు, ఉన్నాములైయమ్మన్ సమేత అన్నామలైయార్ (అరుణాచలేశ్వరుడు), సరస్వతి, లక్ష్మి, సోమస్కందర్, వళ్ళీదైవానై సమేత మురుగప్పెరుమాన్ తదితర దేవతామూర్తులు కూడా దర్శనమిస్తారు. ఆలయానికి నైరుతిదిశగా వళ్ళీదైవానై సమేత ముత్తుకుమారస్వామి ప్రత్యేక సన్నిధిలో కొలువై ఉన్నారు. ఈ సన్నిధికి ఎదురుగా శివకామి సమేత నటరాజస్వామి దర్శనమిస్తారు. వెలుపలి ప్రాకారంలో ప్రత్యేక సన్నిధిలో శుక్రేశ్వరుడు ప్రత్యేక సన్నిధిలో దర్శనమిస్తారు. పరమేశ్వరుడి వద్ద నిలబడి ఆరాధిస్తున్నట్లు శుక్రచార్యులవారి విగ్రహం ఉంది. ఈ ఆలయంలో విశాలమైన రాతి మండపం కూడా ఉంది. ఈ మండపంలోనే ఆలయ వేడుకలు, ఉత్సవమూర్తులకు అలంకారాలు నిర్వహిస్తారు. ఆ మండపం తర్వాత శరభేశ్వరుడి సన్నిధి ఉంది. అక్కడే నవగ్రహాలు, స్థల వృక్షమైన అడవి నిమ్మ చెట్టు కూడా ఉన్నాయి.



వైకాశి విశాఖ వేడుకల్లో ఆదిదంపతులు వెళ్ళీశ్వరర్, కామాక్షి తాయార్





సరస్వతి, లక్ష్మీదేవి అప్పర్, సంబంధర్, సుందరర్, మాణిక్యవాచకర్ విగ్రహాలు



లింగోద్భవుడు

మేట్టూరు డ్యామ్ నుంచి సాగునీరు

● విడుదల చేసిన సీఎం స్టాలిన్

చెన్నై, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లాలోని మేట్టూరు డ్యామ్ నుండి గురువారం ఉదయం డెల్టా జిల్లాలకు సాగునీటిని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ విడుదల చేశారు. ఆ డ్యామ్ చరిత్రలో ఇలా సాగునీరు విడుదల చేయడం 92వ సారి. మేట్టూరులో కావేరినదిపై నిర్మించిన ఈ డ్యామ్ నుంచి సాగునీరు సరఫరా చేస్తుంటారు. ప్రతియేటా జూన్ 12నుంచి జనవరి 28 వరకు 230 రోజులపాటు సాగునీటిని విడుదల చేయడం ఆనవాయితీ. మేట్టూరు డ్యాం జలలాతో సేలం, నామక్కల్, ఈరోడ్, కరూరు, అరియలూరు, పెరంబలూరు, తంజావూరు, నాగపట్టినం, తిరువారూరు, తిరుచ్చి సహా 12 డెల్టా జిల్లాల్లో 17.15 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయి. అంతే కాకుండా 16 జిల్లాల ప్రజలకు తాగునీటి అవసరాలను కూడా తీరుస్తోంది. ఈ యేడాది వేసవిలోనూ కురిసిన కుండపోత వర్షాల కారణంగా డ్యామ్ నీటిమట్టం 115 అడుగులకు చేరింది. అంతేకాకుండా నైరుతి రుతుపవనాలు తీవ్రరూపం దాల్చుతుండటంతో రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ పరిశోధన కేంద్రం అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఈరోడ్, సేలం జిల్లాల్లో రెండు రోజుల పర్యటనకు వెళ్ళిన ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ గురువారం ఉదయం మేట్టూరు డ్యామ్ షట్టర్లను తెరచి సాగునీటిని విడుదల చేశారు. అనంతరం పొంగి ప్రవహించిన జలాలపై ఆయన పూలు చల్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేట్టూరు డ్యామ్ నుంచి తొలుత సెకనుకు 3 వేల ఘనపుటడుగుల చొప్పున నీరు విడుదలవుతుందని, తర్వాత అంచెలంచెలుగా సెకనుకు 10 వేల ఘనపుటడుగుల వంతున జలాలు విడుదలవుతాయన్నారు. ఈ డ్యామ్ నుండి విడుదలవుతున్న జలాల ద్వారా హైడల్ విద్యుత్ ప్రాజెక్టు ద్వారా 460 మెగా వాట్ల విద్యుత్ కూడా ఉత్పత్తి అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దురైమురుగన్, ఈవీ వేలు, ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం, రాజేంద్రన్, శివశంకర్, అన్బిల్ మహేష్ పొయ్యామొళి, మదివేందన్, ఎంపీలు టీఎం సెల్వగణపతి, మణి, మలైయరసన్, మాజీ శాసనసభ్యుడు ఎస్ఆర్ శివలింగం, సేలం జిల్లా కలెక్టర్ డాక్టర్ బృందాదేవి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



నీటిలో పూలు వేస్తున్న సీఎం

కావేరి హాస్పిటల్‌లో మధుమేహం హెల్ప్‌లైన్‌కు అపూర్వ స్పందన



హెల్ప్‌లైన్ లోగో ఆవిష్కరిస్తున్న ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం, కావేరి హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అరవింద్ సెల్వరాజ్ తదితరులు

చెన్నై, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆళ్వార్‌పేటలోని కావేరి హాస్పిటల్‌లో మధుమేహ రోగుల కోసం 2021 ఏప్రిల్ 21 ప్రారంభించిన హెల్ప్‌లైన్ (8880288802)కు అపూర్వ స్పందన లభించిందని కావేరి గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అరవిందన్ సెల్వరాజ్ పేర్కొన్నారు. ఈ హెల్ప్‌లైన్ నిర్విరామంగా 1500 రోజులపాటు మధుమేహ రోగులకు అత్యవసర వైద్య సేవలందించిన సందర్భంగా ఆస్పత్రిలో జరిగిన కార్యక్రమానికి ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం హాజరయ్యారు. ఈ హెల్ప్‌లైన్ ద్వారా వైద్యనిపుణులు, డైటీషియన్లు రోగులకు అందుబాటులో ఉండి చికిత్సలందించారు. రక్తపీడనం తక్కువగా ఉన్న మహిళలకు, ఐటీ ఉద్యోగులకు ఈ హెల్ప్‌లైన్ ద్వారా చికిత్స అందించి నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కావేరి హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ అయ్యనప్పన్ పొన్నుసామి, సీనియర్ కన్సల్టెంట్ డయాబెటాలజిస్ట్ డాక్టర్ భరణీధరన్, డాక్టర్ ఎన్. శేఖర్, డాక్టర్ మహేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్నానగర్‌లో 'అంపా శిష్య స్కూల్'



స్కూల్ ప్రారంభోత్సవంలో నిర్వాహకులు

వాషర్‌మెన్‌పేట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): 'అంపా విద్యా ఎడ్యుకేషనల్ ట్రస్టు' ఆధ్వర్యంలో అన్నా నగర్‌లో అంపా శిష్య స్కూల్ ప్రారంభమైంది. ఇక్కడ ప్రీకేజీ నుంచి 12వ వరకు తరగతులు కూడా ప్రారంభమయ్యాయి. ట్రస్టు వ్యవస్థాపకులు అంపా పళనియప్పన్, నిర్వాహకులు ఉలగమ్మాయి పళనియప్పన్, ట్రస్టీ డాక్టర్ సలీం థామస్, విజి శివరామ్ తదితరులు ఈ పాఠశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మీడియాతో మాట్లాడుతూ.. చెన్నైలో ప్రపంచ స్థాయి విద్యను విస్తృతం చేయాలనే లక్ష్యంగా ఈ పాఠశాలను ప్రారంభించామన్నారు.

మద్య నిషేధంపై విస్తృత ప్రచారం

ప్యారీస్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మద్య రహిత రాష్ట్రంగా తమిళనాడును తీర్చిదిద్దడమే లక్ష్యంగా గ్రేస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'మద్య వద్దు' అనే శీర్షికపై డాక్యుమెంటరీ పోటీలను నిర్వహించనున్నారు. ఈ మేరకు, చెన్నై ప్రెస్‌క్లబ్‌లో గ్రేస్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఆధీర నోవిస్ ప్రభాకర్ గురువారం మీడియాకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడేందుకు యువతను ప్రోత్సహించే విధంగా తమ సంస్థ ఇప్పటికే వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేసిందన్నారు. ప్రస్తుతం మద్య వద్దు అని చెప్పండి అనే శీర్షికతో డాక్యుమెంటరీ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో పాల్గొనదలచిన వారు 15 నిమిషాల నిడివి గల డాకుమెంటరీ చేసి జూలై 15తేదీ నాటికి సమర్పించాలని తెలిపారు. ఆగష్టు 3న విజేతలను ప్రకటించి నగదు బహుమతి జ్ఞాపిక, ప్రశంసాపత్రాలు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.



లోగో ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

సిమ్స్‌లో వృద్ధుడికి అరుదైన శస్త్రచికిత్స

చెన్నై, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక వడపళని సిమ్స్ హాస్పిటల్‌లో ముంబయికి చెందిన 61 యేళ్ల వృద్ధుడికి అరుదైన హృదయనాళ మార్పిడి చికిత్స, బృహద్ధమని దెబ్బతిన్న చోట శస్త్రచికిత్సను ఒకే సమయంలో చేసినట్లు ఆ హాస్పిటల్ హృద్రోగ శస్త్ర చికిత్సా నిపుణుడు డాక్టర్ వీవీ బాషి తెలిపారు. గురువారం హాస్పిటల్ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుండె స్పందన రెండు గంటలపాటు నిలిపి వేసి, దానికి బదులుగా హార్ట్ లంగ్ మిషన్ ఉపయోగించి తన నేతృత్వంలో పదిగంటలపాటు వైద్యబృందం శస్త్రచికిత్స చేసిందని చెప్పారు. శస్త్రచికిత్స ముగిసిన వారం రోజుల తర్వాత రోగి పూర్తికోలుకున్నాడని తెలిపారు. ఈ సమావేశంలో డాక్టర్ మహమ్మద్ ఇద్రీస్ తదితరులు పాల్గొన్నారు.



చికిత్స అనంతరం వృద్ధుడితో డాక్టర్ వీవీ బాషి తదితరులు



కోట్టూరుపురం అన్నా శతజయంతి స్మారక గ్రంథాలయం వద్ద బాలకార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా విద్యార్థుల అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న కార్మిక శాఖ మంత్రి సీవీ గణేషన్



నార్వే, ఆర్మేనియా దేశాల్లో జరిగిన అంతర్జాతీయ చెస్ పోటీల్లో బహుమతులు గెలుచుకున్న గుకేష్, అరవింద్ చిదంబరం, ప్రజ్ఞానందకు క్యాంపు కార్యాలయంలో జ్ఞాపికలను అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న క్రీడామంత్రిత్వ శాఖ కూడా నిర్వర్తిస్తున్న ఉప ముఖ్య మంత్రి ఉదయనిధి. రాష్ట్ర క్రీడాభివృద్ధి సంస్థ మెంబర్ సెక్రటరీ జే మేఘనాథ రెడ్డి కూడా ఉన్నారు.

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 4 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.3.49 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 79,296

తలనీలాలు సమర్పించినవారు: 33,511



గంగమ్మకే శఠగోపం!

● ఫేక్ ఉత్తర్వులతో ప్రమోషన్లు ● వైసీపీ హయాంలో జరిగిన నకిలీ కథ ● ఐదుగురిపై సస్పెన్షన్ వేటు, క్రిమినల్ కేసు ● బలిపశువులుగా భజంత్రీలు ● పరారీలో కంప్యూటర్ ఆపరేటర్

తిరుపతిలోని తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో భజంత్రీలుగా పనిచేస్తున్న ఐదుగురు సిబ్బందిని వైసీపీ అధికారంలోని కొందరి చర్య వలన బలిపశువులగా మారారు. దేవదాయశాఖ కమిషనర్ నుంచి ఉత్తర్వులు వచ్చాయంటూ పదోన్నతి కల్పించేసి వారి కళ్లల్లో నింపిన ఆనందాన్ని మూన్నాళ్ల ముచ్చటగా మార్చారు. కమిషనర్ పేరిట వచ్చిన పదోన్నతి ఉత్తర్వులు ఫేక్ అని తేలడంతో ఐదుగురిపై సస్పెన్షన్ వేటు పడింది. క్రిమినల్ కేసూ నమోదైంది.

- తిరుపతి ఆంధ్రజ్యోతి

ఉమ్మడి ఏపీలో దేవదాయ, ధర్మదాయ శాఖ పరిధిలోని ప్రధాన ఆలయాల్లో భజంత్రీలు (వాయిద్యకారులను) నియమించాలని 2008లో అప్పటి ప్రభుత్వం భావించింది. ఈక్రమంలో తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి 9 మందిని భజంత్రీలు పేరిట నియమించారు. కొంతకాలానికి టైం స్కేల్ ఇచ్చారు. 15 ఏళ్లకు పైగా పనిచేస్తున్నామని, తమను గ్రేడ్-2 నుంచి గ్రేడ్-1 సిబ్బందిగా పదోన్నతి కల్పించాలని పలు సార్లు రాజకీయ ప్రముఖులు, ఉన్నతాధికారులకు వినతిపత్రాలు ఇస్తూ వచ్చారు. ఈక్రమంలో కొందరు హామీలు కూడా ఇచ్చారు. ఈ క్రమంలో భజంత్రీలు జీ.శివకుమార్ (నాదస్వరం), పి.వెంకటసుబ్బయ్య (డోలు), ఆర్.జయరాం (డోలు) 2022 డిసెంబరు 30న గ్రేడ్1గా పదోన్నతి పొందినట్టు కమిషనరు కార్యాలయం ఉత్తర్వు గంగమ్మ ఆలయ కార్యాలయంలో ప్రత్యక్షమైంది. అప్పుడు ఈవోగా ఉన్న మునికృష్ణయ్య 2023 జనవరి 1న గ్రేడ్-2 కేడర్ కింద విధులు నిర్వహిస్తున్న వీరికి గ్రేడ్-1గా పదోన్నతి ఇచ్చేశారు. అనారోగ్య కారణాలతో 2023 అక్టోబరు 1న ఈవో మునికృష్ణయ్య విధుల్లో ఉండగానే మృతిచెందారు. తమతో పాటు పనిచేసిన ముగ్గురికి పదోన్నతి రావడంతో మరికొంతమంది ప్రయత్నించారు. మునికృష్ణయ్య మృతి తర్వాత ఈవోగా వచ్చిన మమత టేబుల్‌పై దేవదాయ శాఖ కమిషనర్ నుంచి వచ్చినట్టు మరో ఉత్తర్వు కనిపించింది. భజంత్రీగా ఉన్న పి.అయ్యప్పను రికార్డు అసిస్టెంట్‌గా, పి.రెడ్డెమ్మ (నాదస్వరం)ను గ్రేడ్-1గా పదోన్నతి ఇస్తున్నట్టు సదరు ఉత్తర్వులో ఉంది. అయితే ఈవో ఉత్తరు కాపీని ముందు, వెనుక చూడకుండా ముందు ఈవో ఇచ్చారు కదా అని వీరికీ పదోన్నతి ఇచ్చేశారు.

ఫేక్ అని బయట పడిందిలా..

'భజంత్రీని రికార్డు అసిస్టెంట్‌గా ఎలా ఇస్తారని? దీనిపై విచారించి చర్యలు తీసుకోకపోతే ఆలయం వద్ద ఆందోళన చేస్తాం' అనే సారాంశంతో ఈ ఏడాది ఏప్రిల్‌లో దేవదాయశాఖ ఆర్జేసీకి ఎవరో వాట్సప్‌లో మెసేజీ పంపారు. తనకు వచ్చిన మెసేజీని ఏప్రిల్ 23న గంగమ్మ ఆలయ ఈవో జయకుమార్‌కు పంపి.. సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆర్జేసీ ఆదేశించారు. దీనిపై ఈవో విచారణ చేపట్టారు. కార్యాలయంలో ఉన్న ఉత్తర్వులు.. కమిషనర్ కార్యాలయంలో లేకపోవడం, కేవలం వాట్సప్, మెయిల్లో ఉత్తర్వులు వచ్చినట్టు ఉండడం, వాటి ఆధారంగా అప్పటి ఆలయ ఈవోలు మునికృష్ణయ్య, మమత వీరికి పదోన్నతలు ఇచ్చినట్టు నిర్ధారణ అయింది. ఆ మేరకు ఆయన ఉన్నతాధికారులకు నివేదక పంపారు. దీంతో ఐదుగురు భజంత్రీలను సస్పెండ్ చేసి పోలీసు కేసు పెట్టాలని అధికారులు ఆదేశించారు. కంప్యూటర్ ఆపరేటర్ పి.సి.నవీన్ కృష్ణ కుమార్ మెయిల్లో ఉత్తర్వులు వచ్చాయని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇది వెలుగులోకి వచ్చిన వెంటనే ఆపరేటర్ నవీన్ పరారీలో ఉన్నాడు. అతడిని విచారిస్తే తప్ప అసలు విషయాలు బయటకు వచ్చే పరిస్థితి కనిపించడంలేదు. కాగా నకిలీ ఉత్తర్వుల వెనుక తమకెలాంటి ప్రమేయం లేదని భజంత్రీలు వాపోతున్నారు. పదోన్నతలు వచ్చాయని అధికారులు చెబితేనే తమకు తెలిసిందని విలపిస్తున్నారు.



మోగింది బడి గంట

● మొదటి రోజు 20 శాతం మందే హాజరు ● పంపిణీకి సిద్ధంగా పాఠ్యపుస్తకాలు, కిట్లు



విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేస్తున్న జిల్లా సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ గౌరీ శంకర్రావు, కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ జి. సురేష్.



తిరుపతిలోని ఎంజీఎం స్కూల్ వద్ద విద్యార్థులు

తిరుపతి(విద్య), జూన్ 12(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల తర్వాత పాఠశాలలు గురువారం పునఃప్రారంభమయ్యాయి. విద్యార్థులు మాత్రం అతితక్కువగానే పాఠశాలలకు హాజరయ్యారు. సుమారు 3 లక్షల మంది విద్యార్థులు తరగతులకు హాజరు కావాల్సి ఉండగా కేవలం 20 శాతం మాత్రమే వచ్చినట్టు విద్యాశాఖాధికారులు వెల్లడించారు. పాఠశాలలు పునః ప్రారంభమైన తర్వాత రోజుల్లోనే రెండో శనివారం, ఆదివారం ఉండటంతో విద్యార్థులు పెద్దగా రాలేదు. సోమవారం నుంచి పూర్తి స్థాయిలో బడిబాట పడతారని అంచనా వేస్తున్నారు. తొలిరోజు వచ్చిన విద్యార్థులకు యూనిఫాం క్లాత్, పాఠ్య.. నోటుపుస్తకాలు, డిక్షనరీలను సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జి. గౌరీ శంకర్రావు, కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ జి. సురేష్ పంపిణీ చేశారు. కాగా, ఎన్నడూ లేనివిధంగా పాఠశాలలు పునఃప్రారంభమైన తొలిరోజునే విద్యార్థులకు పుస్తకాలు, విద్యా సామిగ్రి అందించేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. డాక్టర్ సర్వేపల్లి రాధా కృష్ణన్ కిట్లను అధికారులు పాఠశాలలకు చేర్చారు. స్టూడెంట్ కిట్‌లో బ్యాగ్, మూడు జతల యూనిఫాం క్లాత్, బూట్లు, రెండు జతల సాక్సులు, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, డిక్షనరీ, బెల్టు ఉంటాయి. నోట్‌బుక్స్, బ్యాగ్‌లు, బెల్టులు, డిక్షనరీలు పూర్తిస్థాయిలో పాఠశాలలకు చేరాయి. యూనిఫాం, బూట్లు మాత్రం కొంతమేరకు ఇంకా సరఫరా కావాల్సి ఉంది.

పాఠశాలలకు చేరిన కిట్లు ఇలా

	కావాల్సినవి	చేరినవి	చేరాల్సినవి
నోట్‌బుక్స్	812148	812148	0
బ్యాగ్స్	143330	143330	0
యూనిఫాం	143330	96448	46842
బూట్లు	145464	65595	79869
బెల్టులు	103382	103382	0
డిక్షనరీలు	12550	12550	0

పాఠశాలల వర్గీకరణ:

ఇదివరకు రాష్ట్రంలో మొత్తం 6 రకాల పాఠశాలలు ఉండేవి. కూటమి ప్రభుత్వం దీనిని 9గా విభజించింది. ఆమేరకు పాఠశాలలు, విద్యార్థుల వివరాలివీ

● జిల్లాలో 2,264 ప్రభుత్వ పాఠశాలల్లో 1,42,356 మంది చదువుతున్నారు. , ఫౌండేషనల్ స్కూల్స్ : 1,054
బేసిక్ ప్రైమరీ స్కూల్స్ : 301
మోడల్ ప్రైమరీ స్కూల్స్ : 613
అప్పర్ ప్రైమరీ స్కూల్స్ : 8
హైస్కూల్స్, హైస్కూల్ ప్లస్‌లు : 262 , ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలు : 26

● 803 ప్రైవేటు పాఠశాలల్లో 1,55,784 మంది విద్యార్థులున్నారు.
ప్రీ ప్రైమరీ : 250 పాఠశాలలు
అప్పర్ ప్రైమరీ : 138
సెకండరీ : 290
హైస్కూల్స్ : 123
ప్రైవేట్ ఎయిడెడ్ : 2



హాజరు నమోదుకు ఉపాధ్యాయుల కుస్తీ

ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్ రూ. 600

పాఠశాలల వర్గీకరణ నేపథ్యంలో జిల్లాలో కొన్ని పాఠశాలలు దగ్గరి ప్రాంతాల్లోని ఇతర పాఠశాలల్లో విలీనమయ్యాయి. దీంతో ఆ ప్రాంతం నుంచి విద్యార్థులు మరో ప్రాంతానికి వెళ్లాల్సి వచ్చింది. ఈ విద్యార్థులను వదిలేయకుండా ప్రభుత్వం ట్రాన్స్‌పోర్ట్ చార్జిలు చెల్లించి మరీ బడిబాట పట్టిస్తోంది. గతంతో పోలిస్తే ఒకటిన్నర కిలోమీటర్ల దూరంలోని మెర్జ్ చేసిన పాఠశాలలకు వెళ్లాల్సి ఉన్నప్పటికీ రవాణా భత్యం కింద రూ.600 చెల్లిస్తోంది. ఇలా రవాణా భత్యం చెల్లించాల్సిన విద్యార్థులు జిల్లాలో 11,500 మంది ఉన్నట్టు తెలుస్తోంది.

ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ చేయండి

● అకడమిక్ క్యాలెండర్‌ను విధిగా పాటించాలి
● పిల్లలతో యోగా చేయించాలన్న డీఈవో

తిరుపతి(విద్య), జూన్ 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో తప్పనిసరిగా ఈనెల 21 వరకు ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ చేయాలని డీఈవో కేవీఎన్ కుమార్ ఉపాధ్యాయులను గురువారం ఆదేశించారు. పాఠశాలల్లో చేరికలను 100 శాతం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం వర్గీకరించిన ప్రకారమే విద్యార్థులను తరగతుల్లో కూర్చోబెట్టాలని సూచించారు. విద్యార్థులకు జారీ చేసిన హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను విద్యార్థులు కొత్తగా వెళ్లిన పాఠశాలలకు అందించాలన్నారు. అకడమిక్ క్యాలెండరును తప్పనిసరిగా అనుసరించాలన్నారు. మధ్యాహ్న భోజనాన్ని రుచికరంగా, శుభ్రతతో వడ్డించాలన్నారు. సన్న బియ్యంతోనే వండాలని, పాత బియ్యం స్టాక్ ఉంటే వాటిని వాడొద్దని సూచించారు. విద్యార్థులందరిచేత యోగాచేయించాలని, తరగతుల వారీగా యోగాంధ్ర యాప్‌లో రిజిస్ట్రేషన్ చేయించాలని చెప్పారు. లీప్ యాప్‌లో ఉపాధ్యాయులందరూ ఫేసియల్ అటెండన్స్ వేయాలన్నారు.



డీఈఓ కేవీఎన్ కుమార్

● ఘాట్‌రోడ్లలో మరమ్మతులు

నెమ్మదిగా వెళ్లండి!

వాహనదారులకు టీటీడీ హెచ్చరికలు

తిరుమల, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): తిరుమల-తిరుపతి ఘాట్‌రోడ్లలో మరమ్మత్తులు జరుగుతున్నాయని, వాహనదారులు అప్రమత్తంగా వాహనాలను నడపాలని టీటీడీ గురువారం ఓ ప్రకటన ద్వారా హెచ్చరించింది.ఘాట్‌రోడ్లను మూసివేయకుండానే మరమ్మత్తు పనులను త్వరితంగా పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టామని తెలిపింది. వాహనదారులు నెమ్మదిగా ప్రయాణించాలని, చేరాల్సిన సమయం కన్నా గంట ముందుగా బయలుదేరాలని సూచనలు చేసింది. అత్యవసర సేవలకు టీటీడీ టోల్‌ఫ్రీ 155257ను సంప్రదించాలని పేర్కొంది.

పీజీ సెట్‌కు 86 శాతం హాజరు

● 25న ఫలితాల వెల్లడి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వర్సిటీల్లో పీజీ ప్రవేశానికి ఈ నెల 9 నుంచీ 12వ తేదీ దాకా చేపట్టిన పీజీ సెట్‌కు 86 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. 25,688 మంద దరఖాస్తు చేసుకోగా, 22 వేల మంది పరీక్షలు రాశారు. పీజీసెట్ ఫలితాలు ఈ నెల 25వ తేదీ విడుదల చేయనున్నట్లు కన్వీనర్ పీసీ వేంకటేశ్వర్లు, కో-కన్వీనర్ కె.సురేంద్రబాబు గురువారం తెలిపారు.

ఆర్టీసీ దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(ఆర్టీసీ), జూన్ 12(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ జిల్లా పరిధిలో 79 వాణిజ్య దుకాణాలకు టెంటర్లు ఆహ్వానిస్తున్నట్లు డీపీటీవో వెంకటరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 18వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటలోపు పనిదినాలు, వేళల్లో ఆయా డిపోల మేనేజర్ కార్యాలయాల్లో దరఖాస్తులు అప్పగించాలని పేర్కొన్నారు. అదే రోజున 3గంటలకు టెండరుదారుల సమక్షంలో దరఖాస్తులు తెరవనున్నట్లు తెలిపారు. రెండేళ్ల వరకు కాలపరిమితి ఉంటుందని, ఆసక్తిగలవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. షాపుల వివరాలిలా ఉన్నాయి.

తిరుపతి సీబీఎస్‌లోని శ్రీహరి బస్టాండులో 16, శ్రీనివాసం బస్టాండులో 7, కమర్షియల్ కాంప్లెక్స్‌లో 4, ఏడుకొండల బస్టాండులో 2. రేణిగుంట 1, పాకాల 9, భాకరాపేట 4, శ్రీకాళహస్తి 9, ఏర్పేడు 1, పుత్తూరు 2, బాలాయపల్లి 1, వెంకటగిరి 2, వాకాడు 11, సూళ్లూరుపేట 2, నాయుడుపేట 2, తడ1, చిల్లకూరు 2, గూడూరు 2, ఓజిలి 1 ఉన్నాయి.

పీసీసీ చీఫ్ షర్మిల పర్యటన వాయిదా

తిరుపతి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలో శుక్రవారం జరగాల్సిన పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల పర్యటన వాయిదా పడింది. అహ్మదాబాద్‌లో ఘోర విమాన ప్రమాదం కారణంగా ఆమె పర్యటనను వాయిదా వేసుకున్నారు. ముందుగా నిర్ణయించిన మేరకు శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు శ్రీకాళహస్తిలో జరిగే జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యవర్గం.. కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొనాల్సి వుంది. దీని కోసం కాంగ్రెస్ నేతలు ఏర్పాట్లు చేసుకున్నారు. గురువారం మధ్యాహ్నం జరిగిన విమాన ప్రమాదంలో పెద్ద ఎత్తున ప్రాణ నష్టం జరగడంతో ఈ సమావేశాలను వాయిదా వేసుకున్నారు.

కామాంధుడి అరెస్టు

పిచ్చాటూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు మండలంలో 15 ఏళ్ల బాలికను మాయ మాటలతో మభ్యపెట్టి అత్యాచారానికి పాల్పడిన కామాంధుడు శేఖర్(55)ను అరెస్టు చేసినట్లు సీఐ రవీంద్ర, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. గత నెలలో జరిగిన ఈ ఘటనపై తన తల్లికి బాలిక వివరించడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై పోక్సో. రేప్ కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

టీటీడీ ప్రాణదానం ట్రస్టుకు రూ.10 లక్షలు



అదనపు ఈవోకు చెక్కు అందజేస్తున్న లోకేష్‌రెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి

తిరుమల/నాయుడుపేట, జూన్12(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఎస్వీ ప్రాణదానం ట్రస్టుకు గురువారం రూ.10 లక్షలు విరాళంగా అందింది. నాయుడుపేటకు చెందిన పోతిరెడ్డి లోకేష్ రెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి ఈ విరాళం చెక్‌ను తిరుమలలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు. వారి వెంట వై.రాఘవేంద్ర ఉన్నారు.



ఏటీఎం గదిలో నాగుపాము

తిరుమల, జూన్12(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని ఎస్వీ మ్యూజియం సమీపంలోని ఓ ఏటీఎం గదిలోకి నాలుగు అడుగుల నాగుపాము ప్రవేశించింది. అక్కడి సిబ్బంది గుర్తించి బయటకు పరుగు తీశారు. వీరి సమాచారంతో పాములు పట్టే టీటీడీ ఉద్యోగి భాస్కర్‌నాయుడు చేరుకుని పామును పట్టుకున్నాడు. వాసవి భవనంలోని స్టోర్‌లో కూడా సుమారు ఐదు అడుగుల పొడవైన జెర్రిపోతు పాము చొరబడింది. దీనిని కూడా ఆయన చాకచక్యంగా పట్టుకున్నారు. ఈరెండు పాములను అడవిలో విడిచిపెట్టారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

హత్యాయత్నం కేసులో నిందితురాలి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 12(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో బుధవారం జరిగిన హత్యాయత్నం ఘటనలో నిందితురాలిని గురువారం అలిపిరి పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌ఐ నాగార్జున రెడ్డి కథనం మేరకు.. సుబ్బారెడ్డి నగర్‌కు చెందిన గీత, ఆమె కుమారుడు హేమకుమార్ జనవరిలో నెల్లూరుకు చెందిన కుమారికి ఎంబ్రాయడరీ మిషన్‌ను రూ.4 లక్షలకు విక్రయించి డబ్బు తీసుకున్నారు. నెలలు గడచినా ఎంబ్రాయడరీ మిషన్ ఇవ్వలేదు. దీంతో పలుసార్లు గీతను అడిగారు. ఈ క్రమంలో రూ3.40 లక్షలు తిరిగి ఇచ్చేశారు. మిగిలిన రూ 60 వేలు మాత్రం ఇవ్వకుండా తిప్పుకొంటున్నారు. దీంతో గీత ఇంటికి కుమారి వచ్చి డబ్బుల విషయమై గొడవ పడ్డారు. అదే సమయంలో హేమకుమార్ బయటకు వచ్చి కుమారితో మాట్లాడుతుండగా.. ఆమె తన వెంట తెచ్చుకున్న పెట్రోలును తల్లీ కొడుకుపైన పోసి లైటర్ వెలిగించారు. అక్కడ్నుంచి తప్పించుకుని పరారయ్యారు. గీత, హేమకుమార్‌ను మంటల నుంచి స్థానికులు కాపాడి రుయాలో చేర్పించారు. జరిగిన ఘటనపై అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు.. నిందితురాలు కుమారిని లెప్రసీ ఆస్పత్రి వద్ద అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.



నిందితురాలిని అరెస్టు చేసిన పోలీసులు

నలుగురు ఇరిగేషన్ డీఈలకు పదోన్నతి

తిరుపతి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జలవనరుల శాఖలో డీఈలుగా పనిచేస్తున్న నలుగురికి ఈఈలుగా తాత్కాలిక పదోన్నతి లభించింది. పదోన్నతిపై వారిని వేర్వేరు చోట్లకు ప్రభుత్వం బదిలీ చేసింది. తెలుగుగంగ ప్రాజెక్టు నాయుడుపేట సబ్ డివిజన్‌లో డీఈగా పనిచేస్తున్న వి.గజేంద్రరెడ్డి ఈఈగా పదోన్నతిపై నెల్లూరు 2వ ఎస్‌బీ డివిజన్‌కు బదిలీ అయ్యారు. తెలుగు గంగ ప్రాజెక్టు శ్రీకాళహస్తి క్వాలిటీ కంట్రోల్ సబ్ డివిజన్ డీఈ ఎస్.వేణుగోపాల్ ఈఈగా నంద్యాల ఎస్‌ఆర్‌బీసీ రెండవ సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ సూపరింటెండెంట్ ఇంజనీరుగా బదిలీ అయ్యారు. కడప హైడ్రాలజీ డివిజన్ పరిధిలో తిరుపతి సబ్ డివిజన్‌కు డీఈగా వున్న టి.సురేంద్ర రెడ్డి ఈఈగా పదోన్నతి మీద కడప జిల్లా పులివెందుల జీఎన్ఎస్ఎస్ 7వ డివిజన్‌కు బదిలీ అయ్యారు. తెలుగుగంగ ప్రాజెక్టు శ్రీకాళహస్తి 3వ సబ్ డివిజన్‌లో డీఈగా పనిచేస్తున్న పి.చిన్మయలింగం ఈఈగా పదోన్నతిపై కడప కన్‌స్ట్రక్షన్ సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ సూపరింటెండెంట్ ఇంజనీరుగా బదిలీ అయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా 11 మంది డీఈలకు పదోన్నతులు లభించగా వారిలో నలుగురు జిల్లాకు చెందిన వారు. ఈ మేరకు రాష్ట్ర జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఆగస్టు 15 నుంచి మహిళలకు

ఉచిత బస్సు ప్రయాణం



తిరుమల, జూన్12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మహిళలు ఎదురుచూస్తున్న ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం ఆగస్టు 15 నుంచి మొదలువుతుందని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. తిరుమల శ్రీవారిని గురువారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. తమ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయిన సందర్భంగా 'తల్లికి వందనం' కార్యక్రమాన్ని సీఎం ప్రారంభిస్తున్నారన్నారు. శ్రీవారి ఆశీస్సులు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, రాష్ట్ర ప్రజలు, ముఖ్యంగా రైతులకు ఉండాలని ప్రార్థించానన్నారు.

జాతీయ స్మారకాలుగా గొట్టిప్రోలు, చింతకుంట!



● కేంద్రం చర్యలు చేపట్టిందన్న డాక్టర్ వీరాంజనేయులు

నాయుడుపేట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మండలంలోని గొట్టిప్రోలు, కడప జిల్లాలోని చింతకుంటను జాతీయ స్మారకాలుగా గుర్తించేందుకు కేంద్ర సాంస్కృతిక, పురావస్తు శాఖ చర్యలు చేపట్టిందని అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు, అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. చింతకుంట, గొట్టిప్రోలును జాతీయ స్మారకాలుగా గుర్తించాలని ఈ మేరకు ఏప్రిల్ 30వ తేదీన ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి లేఖ ద్వారా విజ్ఞప్తి చేశామన్నారు. ప్రధానమంత్రి కార్యాలయ సూచన మేరకు కేంద్ర సాంస్కృతిక, పురావస్తు శాఖ డైరెక్టర్ జనరల్ బాడీజర్ కడప జిల్లాలోని చింతకుంట ప్రాచీన రాతిచిత్రాలు, తిరుపతి జిల్లా నాయుడుపేట మండలం గొట్టిప్రోలులో ఉన్న పురాతన సంపదను జాతీయ స్మారకాలుగా గుర్తించేందుకు చర్యలు ప్రారంభించారన్నారు. చింతకుంటలోని ఆదిమానవుల శిలా రేఖాచిత్రాలకు, గొట్టిప్రోలు కోటదిబ్బకు ఘన చరిత్ర ఉందని డాక్టర్ జాస్తి వీరాంజనేయులు పేర్కొన్నారు.



గొట్టిప్రోలులో పురావస్తుశాఖ తవ్వకాలలో బయటపడ్డ విగ్రహం, కోటదిబ్బ